PRGI Reg No -"APTEL/26/A1193

నేటి
# శుభోదయ
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక

చదవండి..... చదివించండి....


ప్రతిక్షణం... ప్రజల కోసం...
www.netishubhodaya.com
96965 71571

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, సంపుటి 01, సంచిక 171 సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -8, మంగళవారం - 11 - ఆగష్టు - 2026 , వెల రూ.5/-

# 2027 నాటికి భూముల రీసర్వే పూర్తి చేస్తాం

- సీఎం చంద్రబాబు



- ఏలూరు జిల్లా కలిదిండిలో 'మీ భూమి–మీ హక్కు' కార్యక్రమం
- కొత్త పట్టాదారు పాస్‌బుక్కులు పంపిణీ చేసిన సీఎం చంద్రబాబు
- గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూ రికార్డుల తప్పులను సరిదిద్దుతామని వెల్లడి
- బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ, క్యూఆర్ కోడ్‌తో పటిష్ఠమైన భద్రతా ఫీచర్లతో కొత్త పాస్‌బుక్కులు
- రెవెన్యూ సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ఏకైక ఎజెండా అని స్పష్టం

**నేటి శుభోదయ, అమరావతి :** రాష్ట్రంలో భూ రికార్డుల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టామని, 2027 నాటికి భూముల రీసర్వే ప్రక్రియను పూర్తి చేసి, ప్రభుత్వ అధికారిక చిహ్నంతో కూడిన పట్టాదారు పాస్‌బుక్కులను రైతులకు, భూ యజమానులకు అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. రెవెన్యూ సంబంధిత సమస్యలను పరిష్కరించడమే తమ కూటమి ప్రభుత్వ ఏకైక ఎజెండా అని ఆయన పునరుద్ఘాటించారు. సోమవారం ఏలూరు జిల్లా, కైకలూరు నియోజకవర్గంలోని కలిదిండిలో జరిగిన 'మీ భూమి–మీ హక్కు' పట్టాదారు పాస్‌బుక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నల్లజర్ల దుర్గాభవాని అనే మహిళా రైతుకు అధికారిక చిహ్నంతో కూడిన కొత్త పట్టాదారు పాస్‌బుక్‌ను అందజేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో సీఎం మాట్లాడుతూ.. కేంద్రంలో, రాష్ట్రంలో ఉన్న డబుల్ ఇంజిన్ ప్రభుత్వం బుల్లెట్ వేగంతో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తోందన్నారు. రెండో ప్రపంచ యుద్ధంలో పాల్గొన్న మాజీ సైనికులకు కేటాయించిన భూములను సెక్షన్ 22-A పరిధిలో పెట్టి ఇబ్బందులకు గురిచేస్తే, తమ ప్రభుత్వం ఆ సమస్యను పరిష్కరించి వారికి పట్టాలు అందించిందని గుర్తుచేశారు.

### గత ప్రభుత్వ వైఫల్యాలపై విమర్శలు

2019–2024 మధ్య గత ప్రభుత్వ హయాంలో జరిగిన విధ్వంసం రెవెన్యూ రికార్డులను తీవ్రంగా దెబ్బతీసిందని చంద్రబాబు ఆరోపించారు. భూములు, ఆస్తులను డిజిటల్‌గా 22-A పరిధిలోకి తెచ్చి వివాదాలు సృష్టించారని మండిపడ్డారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే భూ సమస్యలపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు వెల్లువెత్తాయని తెలిపారు. ఈ నేపథ్యంలో భూ రికార్డులను శుభ్రపరిచి, క్రమబద్ధీకరించేందుకు 'రెవెన్యూ రికార్డ్స్ రిఫార్మ్స్ 2026'ను ప్రవేశపెట్టినట్లు వివరించారు.

### పటిష్ఠ భద్రతతో కొత్త పాస్‌బుక్కులు

కొత్తగా జారీ చేస్తున్న పట్టాదారు పాస్‌బుక్కులలో కరెన్సీ నోట్లకు వినియోగించే తరహాలోనే పటిష్ఠమైన భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నామని సీఎం తెలిపారు. ఆస్తుల వివరాలను మార్చేందుకు వీలులేకుండా బ్లాక్‌చెయిన్ టెక్నాలజీని, దీనికి అదనంగా క్యూఆర్ కోడ్ వంటి సాంకేతిక భద్రతా ఫీచర్లను పొందుపరిచామన్నారు. రైతుల సమక్షంలోనే రీసర్వే నిర్వహిస్తూ, వారి ఈ-కేవైసీ తీసుకున్నాకే గ్రామసభలు పెట్టి పారదర్శకంగా పాస్‌బుక్కులు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు.

ఇప్పటివరకు 32.22 లక్షల పట్టాదారు పాస్‌బుక్కులు రైతులకు, భూ యజమానులకు అందజేశామని, రాబోయే ఏడు నెలల్లో 9,365 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి 68.64 లక్షల పాస్‌బుక్కులు జారీ చేస్తామని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు దాదాపు 41,000 ఎకరాలకు సంబంధించిన భూ సమస్యలను పరిష్కరించడం ద్వారా 1.27 లక్షల మంది రైతులకు, పరిశ్రమలకు, ప్రజలకు లబ్ధి చేకూర్చామన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, నిబంధనలు ఉల్లంఘిస్తే వారు సొంత పార్టీ వారైనా ఉపేక్షించేది లేదని గుంటూరు ఘటనను ఉదాహరణగా చూపిస్తూ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రైతులకు ట్రాక్టర్లను పంపిణీ చేసి, ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను సీఎం సందర్శించారు.

## 'ఆ పేరుతోనే తలనొప్పి'..

- ప్రధాని మోదీని కడుపుబ్బా నవ్వించిన బాక్సర్ నరేందర్..



- ప్రధాని మోదీని కలిసిన బాక్సర్ నరేందర్ బెర్వాల్
- 2015 మిలిటరీ గేమ్స్ నాటి ఓ ఘటనను పంచుకున్న నరేందర్
- పాక్ బాక్సర్‌ను ఓడించిన తర్వాత జరిగిన సరదా సంభాషణ
- 'నరేంద్ర' అనే పేరుపై పాక్ బాక్సర్ చేసిన ఫన్నీ కామెంట్
- ఈ కథ విని ప్రధాని మోదీ పగలబడి నవ్విన వైనం

2

## పన్నుల బిల్లుకు పార్లమెంట్ ఆమోదం

- యూపీఐ ఛార్జీలపై నిర్మలా సీతారామన్ కీలక ప్రకటన



- పన్నుల సవరణ బిల్లు 2026కు పార్లమెంట్ ఆమోదం
- యూపీఐ లావాదేవీలపై వినియోగదారులకు ఛార్జీలు లేవని నిర్మలా సీతారామన్ స్పష్టీకరణ
- మర్చంట్ డిస్కౌంట్ రేట్‌పై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదన్న కేంద్రం
- భవిష్యత్తులో ఛార్జీలు వచ్చినా వ్యాపారులకే, అదీ పెద్ద లావాదేవీలకే వర్తింపు
- రోజువారీ కొనుగోళ్లు 90 శాతం ఉచితంగానే కొనసాగుతాయని వెల్లడి

2

## తెలుగు అమ్మాయిలతో స్కెచ్..

**ఢిల్లీ కేంద్రంగా భారీ మోసం గుట్టురట్టు!**




2

## సురక్షితంగా తీసుకొస్తాం..

- థాయ్‌లాండ్‌లో చిక్కుకున్న తెలుగు యువతకు అండగా మంత్రి లోకేశ్

- ఉద్యోగాల పేరుతో థాయ్‌లాండ్‌కు వెళ్లి మోసపోయిన తెలుగు యువత
- సైబర్ నేరగాళ్ల చెర నుంచి తప్పించుకుని సరిహద్దుల్లో చిక్కుకున్న బాధితులు
- తమను రక్షించాలంటూ సోషల్ మీడియా ద్వారా అభ్యర్థన
- స్పందించిన మంత్రి నారా లోకేశ్, సురక్షితంగా రప్పిస్తామని హామీ
- విదేశాంగ శాఖ అధికారులతో సమన్వయం చేస్తున్నట్లు వెల్లడి



**నేటి శుభోదయ, మంగళగిరి :** ఉద్యోగాల ఆశతో థాయ్‌లాండ్‌కు వెళ్లి, సైబర్ నేరగాళ్ల చేతిలో చిక్కి మోసపోయిన తెలుగు యువతకు ఏపీ ప్రభుత్వం అండగా నిలిచింది. మయన్మార్- థాయ్‌లాండ్ సరిహద్దుల్లో నిస్సహాయ స్థితిలో చిక్కుకుపోయిన వారిని సురక్షితంగా స్వదేశానికి రప్పిస్తామని రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చారు. ఈ మేరకు అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేసి, కేంద్ర విదేశాంగ శాఖతో సమన్వయం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఇద్దరు, హైదరాబాద్‌కు చెందిన ముగ్గురు, పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఒకరితో సహా మొత్తం ఆరుగురు యువకులు మంచి ఉద్యోగాల కోసం ఓ ఏజెంట్‌ను నమ్మి థాయ్‌లాండ్‌కు వెళ్లారు. అయితే, అక్కడకు చేరాక వారు మోసపోయారని గ్రహించారు. సైబర్ నేరాలకు పాల్పడే ఓ ముఠా వీరిని నిర్బంధించి, తీవ్రమైన ఒత్తిడి, వేధింపులకు గురిచేస్తూ చట్టవ్యతిరేక కార్యకలాపాల్లోకి బలవంతంగా దించింది. ఈ నరకం నుంచి బయటపడేందుకు బాధితులు ఎలాగోలా కొంత డబ్బు చెల్లించి, వారి చెర నుంచి తప్పించుకున్నారు. ప్రస్తుతం వారు థాయ్‌లాండ్ వైపు ఉన్న మయన్మార్ సరిహద్దు ప్రాంతానికి చేరుకుని అక్కడే చిక్కుకుపోయారు. తమను ఎక్కడికైనా తరలించే ప్రమాదం ఉందని భయపడుతూ, తమను రక్షించాలంటూ సోషల్ మీడియా...

2

## ఆగస్టు 17 నుంచి ఏపీ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు...

**ఈసారి కూడా వైసీపీ గైర్హాజరు?**




**నేటి శుభోదయ, అమరావతి :** ఆంధ్రప్రదేశ్ శాసనసభ వర్షాకాల సమావేశాలు ఆగస్ట్ 17 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ సోమవారం నోటిఫికేషన్ జారీ చేశారు. అయితే, ప్రతిపక్ష హోదా వివాదం నేపథ్యంలో ఈ సమావేశాలకు దూరంగా ఉండాలని వైసీపీ యోచిస్తున్నట్లు తెలుస్తోంది. నోటిఫికేషన్ ప్రకారం, ఆగస్ట్ 17న ఉదయం 9 గంటలకు శాసనసభ, ఉదయం 10 గంటలకు శాసనమండలి సమావేశాలు ప్రారంభమవుతాయి. 2024 ఎన్నికల్లో కేవలం 11 స్థానాలకే పరిమితమైన వైసీపీకి ప్రతిపక్ష నేత (ఎల్‌ఓపీ) హోదా ఇచ్చేందుకు ప్రభుత్వం నిరాకరించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, తమ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు ఎల్‌ఓపీ హోదా కల్పించనంత...

2

## దైవ నామాలను అపహాస్యం చేయొద్దు - పవన్ కల్యాణ్



- గోవింద నామాలను పేరడీ చేయడంపై పవన్ కల్యాణ్ ఆగ్రహం
- నెల్లూరులో ఓ పార్టీ చర్యను తీవ్రంగా ఖండించిన జనసేనాని
- భక్తుల మనోభావాలను కించపరిచే కుట్రపూరిత చర్యగా అభివర్ణన
- ఈ ఘటనపై చట్టపరంగా ముందుకెళ్లాలని పార్టీ నేతలకు ఆదేశం

2

## టీడీపీ ఎమ్మెల్యే దామచర్లకు జనసేన నేత బాలినేని సవాల్



- ఒంగోలులో కూటమి నేతల మధ్య ముదిరిన రాజకీయ వైరం
- ఎమ్మెల్యే దామచర్ల అవినీతికి పాల్పడుతున్నారన్న బాలినేని
- దమ్ముంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి తనపై పోటీ చేయాలని సవాల్

2

## టీడీపీ ఎమ్మెల్యే దామచర్లకు జనసేన నేత బాలినేని సవాల్

**మొదటిపేజీ తరువాయి..** ప్రకాశం జిల్లా ఒంగోలు నియోజకవర్గ కూటమి రాజకీయం ఉద్రిక్తంగా మారింది. స్థానిక టీడీపీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు, జనసేన నేత బాలినేని శ్రీనివాసరెడ్డి మధ్య ఆరోపణల పర్వం మరింత ముదిరింది. ఎమ్మెల్యే దామచర్ల అర్ధరాత్రి వరకు సెటిల్‌మెంట్లు, అవినీతికి పాల్పడుతున్నారంటూ తాను చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానని బాలినేని స్పష్టం చేశారు. తన ఆరోపణలపై ధైర్యముంటే కాణిపాకం వచ్చి ప్రమాణం చేద్దామని, సమయం చెబితే తాను కూడా వస్తానని సవాల్ విసిరారు. ఒంగోలులో కూటమిలోని జనసేన కార్యకర్తలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, ఇక్కడ జరుగుతున్న అరాచకాలను త్వరలోనే జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళతానని బాలినేని తెలిపారు. జనసేన సైనికులు వేసిన ఓట్లతోనే దామచర్ల గెలిచారని, దమ్ముంటే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి స్వతంత్రంగా పోటీ చేయాలని సవాల్ విసిరారు. ఒకవేళ దామచర్ల రాజీనామా చేస్తే తన మద్దతుతో ఆయనపై పోటీ చేసి 30 వేల ఓట్ల మెజార్టీతో గెలిచి తీరుతానని, లేదంటే జీవితాంతం రాజకీయాలు వదిలేస్తానని ధీమా వ్యక్తం చేశారు. కాగా, పరిస్థితి తీవ్రరూపం దాల్చుతుండడంతో టీడీపీ, జనసేన హైకమాండ్ లు ఈ వ్యవహారంపై దృష్టిసారించాయి. కూటమి సమన్వయ కమిటీ సభ్యులు ఇరువురు నేతలతో మాట్లాడి, సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. కూటమి ప్రతిష్ఠ దెబ్బతినే వరకు తీసుకురావద్దని స్పష్టం చేశారు.

## పన్నుల బిల్లుకు పార్లమెంట్ ఆమోదం..

### - యూపీఐ ఛార్జీలపై నిర్మలా సీతారామన్ కీలక ప్రకటన

**మొదటిపేజీ తరువాయి..**
యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) లావాదేవీలపై వినియోగదారులకు ఎటువంటి ఛార్జీలు లేదా పన్నులు విధించే ఉద్దేశం లేదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం పార్లమెంటులో స్పష్టం చేశారు. పన్నుల, ఇతర చట్టాల (సవరణ) బిల్లు 2026కు పార్లమెంట్ ఆమోదం తెలిపిన సందర్భంగా ఆమె ఈ కీలక ప్రకటన చేశారు. గత వారం లోక్‌సభ ఆమోదం పొందిన ఈ బిల్లును, సోమవారం రాజ్యసభ సైతం మూజువాణి ఓటు ద్వారా ఆమోదించింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ చట్టంలోని సెక్షన్ 10ఏకు చేసిన సవరణ కేవలం వెసులుబాటు కల్పించే నిబంధన మాత్రమేనని వివరించారు. ఈ సవరణ ద్వారా యూపీఐ వినియోగదారులపై ఎటువంటి లావాదేవీ ఛార్జీలు లేదా పన్నులు విధించడం లేదని ఆమె సభకు విస్పష్టంగా తెలిపారు. మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధింపుపై వెలువడుతున్న ఊహాగానాలపై కూడా ఆమె స్పష్టతనిచ్చారు. పార్లమెంట్ ఆమోదం అనంతరం నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) స్టీరింగ్ కమిటీ దీనిపై తుది నిర్ణయం తీసుకుంటుందని, ప్రస్తుతం ఎటువంటి ఎండీఆర్ ఫ్రేమ్‌వర్క్‌ను ఖరారు చేయలేదని వెల్లడించారు. భవిష్యత్తులో ఒకవేళ ఎండీఆర్‌ను ప్రవేశపెట్టినా, అది కేవలం నిర్దిష్ట పరిమితికి మించిన అధిక విలువ గల వ్యాపార లావాదేవీలకు మాత్రమే వర్తిస్తుందని ఆర్థిక శాఖ గతంలోనే స్పష్టం చేసింది. పాలు, కూరగాయలు, కిరాణా వంటి 90 శాతానికి పైగా రోజువారీ కొనుగోళ్ల వ్యాపారులకు కూడా ఉచితంగానే అందుబాటులో ఉంటాయని అధికారులు వెల్లడించారు. 2016లో ప్రారంభమైన యూపీఐ, 2020 జనవరి నుంచి ఉచిత సేవలను అందిస్తూ ప్రపంచంలోనే అతిపెద్ద రియల్-టైమ్ చెల్లింపు వ్యవస్థగా అవతరించింది.

## ఆగస్టు 17 నుంచి ఏపీ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు...

### ఈసారి కూడా వైసీపీ గైర్హాజరు?

**మొదటిపేజీ తరువాయి..** వరకు అసెంబ్లీకి హాజరయ్యే ప్రసక్తే లేదని ఆ పార్టీ ఇప్పటికే స్పష్టం చేసింది. ప్రజల గొంతుకను బలంగా వినిపించాలంటే ప్రతిపక్ష హోదా తప్పనిసరి అని, ప్రజాస్వామ్యాన్ని గౌరవించకపోవడం వారి అవివేకమే అవుతుందని జగన్ గతంలో వ్యాఖ్యానించారు. ఈ హోదాకు సంబంధించిన అంశం ప్రస్తుతం హైకోర్టులో విచారణ దశలో ఉంది. అయితే, అసెంబ్లీకి దూరంగా ఉన్నప్పటికీ శాసనమండలి సమావేశాలకు మాత్రం హాజరు కావాలని వైసీపీ నిర్ణయించింది. మండలిలో తమకు పూర్తి మెజారిటీ ఉండటంతో, వివిధ ప్రజా సమస్యలపై ఎన్డీఏ ప్రభుత్వాన్ని నిలదీసేందుకు సిద్ధమవుతోంది. ముఖ్యంగా, మెగా డీఎస్సీ-2025లో చోటుచేసుకున్నాయని ఆరోపిస్తున్న అక్రమాలపై మండలిలో గళం విప్పనుంది. ఈ అంశంపై తక్షణమే సీబీఐ విచారణ జరపాలని, పారదర్శక దర్యాప్తు కోసం విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేయాలని వైసీపీ డిమాండ్ చేస్తోంది. అయితే, తాము డీఎస్సీ పరీక్షను రద్దు చేయాలని గానీ, ఇప్పటికే నియామకమైన అభ్యర్థులను తొలగించాలని గానీ కోరడం లేదని వైసీపీ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి స్పష్టం చేశారు. అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి, అర్హులైన అభ్యర్థులకు న్యాయం చేయడమే తమ లక్ష్యమని ఆయన వివరించారు. దీంతో ఈ వర్షాకాల సమావేశాలు వాడివేడిగా జరిగే అవకాశం కనిపిస్తోంది.

# 'ఆ పేరుతోనే తలనొప్పి'..

### - ప్రధాని మోదీని కడుపుబ్బా నవ్వించిన బాక్సర్ నరేందర్..

**మొదటిపేజీ తరువాయి..**
క్రీడారంగంలో మైదానంలో జరిగే పోటీలే కాదు, మైదానం బయట జరిగే కొన్ని సంఘటనలు కూడా దశాబ్దాల పాటు గుర్తుండిపోతాయి. అలాంటి ఓ సరదా సంఘటనను భారత బాక్సర్ నరేందర్ బెర్వాల్, ప్రధాని నరేంద్ర మోదీతో పంచుకున్నారు. కామన్వెల్త్ గేమ్స్‌లో రజత పతకం గెలిచిన క్రీడాకారులను అభినందించేందుకు ప్రధాని తన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ ఆసక్తికర సంభాషణ జరిగింది. నరేందర్ చెప్పిన కథ విని ప్రధాని మోదీ సైతం పగలబడి నవ్వారు. 2015లో జరిగిన వరల్డ్ మిలిటరీ గేమ్స్‌లో తన తొలి బౌట్ పాకిస్థాన్ బాక్సర్‌తో జరిగిందని నరేందర్ గుర్తుచేసుకున్నారు. అది మిలిటరీ గేమ్స్ కావడం, ఇరు దేశాల మధ్య సరిహద్దు ఉద్రిక్తతలు ఉండటంతో.. పాకిస్థాన్‌పై ఎట్టిపరిస్థితుల్లోనూ ఓడిపోవద్దని తనకు సైనిక అధికారుల నుంచి ఫోన్లు వచ్చాయని ఆయన వెల్లడించారు. ఆ మ్యాచ్‌లో తాను 4-1, 3-2 తేడాతో గెలిచానని, అయితే ఇద్దరికీ గాయాలయ్యాయని తెలిపారు. దీంతో కుట్లు వేయించుకోవడానికి ఇద్దరూ కలిసి ఆసుపత్రికి వెళ్లినట్లు చెప్పారు. ఆసుపత్రిలో జరిగిన సంభాషణను నరేందర్ వివరిస్తూ, "2014లో మీరు (మోదీ) తొలిసారి ప్రధాని అయ్యారు. మాతో ఉన్న ఆర్మీ కోచ్ పేరు నరేంద్ర రాణా. నా పేరు నరేందర్. ఈ విషయాలను గమనించిన పాక్ బాక్సర్ నా దగ్గరకు వచ్చి 'సోదరా, ఒక మాట చెప్పనా?' అని అడిగాడు. చెప్పమని అన్నాను" అని తెలిపారు. అప్పుడు ఆ పాక్ బాక్సర్.. "నీ పేరు నరేందర్, నీ కోచ్ పేరు నరేందర్, మీ ప్రధాని పేరు కూడా నరేంద్ర. నాకు ఈ నరేంద్ర అనే పేరు వింటేనే ద్వేషం వచ్చేస్తోంది" అని అన్నాడని నరేందర్ చెప్పగానే ప్రధాని మోదీ ఒక్కసారిగా పగలబడి నవ్వారు. ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ పలువురు క్రీడాకారులతో ప్రత్యేకంగా మాట్లాడి, భారత క్రీడారంగానికి వారు అందిస్తున్న సేవలను అభినందించారు.

## దైవ నామాలను అపహాస్యం చేయొద్దు : పవన్ కల్యాణ్

**మొదటిపేజీ తరువాయి..** దైవ నామాలను, భక్తి గీతాలను రాజకీయ ప్రయోజనాల కోసం పేరడీలుగా మార్చి అపహాస్యం చేయడాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తీవ్రంగా ఖండించారు. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి పవిత్ర నామాలను కించపరచడం దారుణమని ఆయన పేర్కొన్నారు. భక్తుల మనోభావాలను దెబ్బతీసే ఇలాంటి చర్యలను ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. నెల్లూరు నగరంలో చోటుచేసుకున్న ఓ ఘటనను ఆయన ప్రస్తావించారు. కనీసం ప్రతిపక్ష హోదా కూడా లేని ఓ రాజకీయ పార్టీ, తమ కార్యక్రమాల్లో పవిత్రమైన గోవింద నామాలను పేరడీగా వాడుకోవడం భక్తుల మనోభావాలను తీవ్రంగా గాయపరిచిందని అన్నారు. ఆ కార్యక్రమంలో పాల్గొన్న వారి తీరు ధార్మిక విశ్వాసాలకు విఘాతం కలిగించేలా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది కేవలం అపహాస్యం చేయడమే కాదని, మతపరమైన విద్వేషాలను రెచ్చగొట్టే కుట్ర పూరిత ఆలోచన అని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ శ్రేణులకు పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు. ధార్మిక విశ్వాసాలతో ముడిపడిన అంశాలను చులకన చేసే ఇలాంటి చర్యలను సహించకూడదని స్పష్టం చేశారు. రాజకీయాలతో సంబంధం లేకుండా ఎవరూ కూడా దైవ నామాలు, మంత్రాలు, స్తోత్రాలను అపహాస్యం చేసేందుకు వినియోగించవద్దని ఆయన హితవు పలికారు. భక్తికి సంబంధించిన పవిత్రమైన విషయాలను గౌరవించడం అందరి బాధ్యత అని ఆయన సూచించారు. ఈ మేరకు జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది.

# సురక్షితంగా తీసుకొస్తాం..

### - థాయ్‌లాండ్‌లో చిక్కుకున్న తెలుగు యువతకు అండగా మంత్రి లోకేశ్

**మొదటిపేజీ తరువాయి..** ద్వారా వేడుకున్నారు. ఈ వీడియోలు, పోస్టులు వైరల్ కావడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఈ విషయం తన దృష్టికి రావడంతో మంత్రి నారా లోకేశ్ వెంటనే స్పందించారు. బాధితుల ఆందోళన, వేదనను తాను అర్థం చేసుకోగలనని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. "థాయ్‌లాండ్‌లో చిక్కుకున్న యువత పరిస్థితి గురించి తెలిసింది. వారి కుటుంబ సభ్యుల ఆందోళనను అర్థం చేసుకోగలను. బాధితులను సురక్షితంగా వెనక్కి తీసుకువచ్చేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటాం" అని లోకేశ్ హామీ ఇచ్చారు. తక్షణమే అధికారులతో మాట్లాడి, కేంద్ర విదేశాంగ శాఖ, సంబంధిత రాయబార కార్యాలయ అధికారులతో సమన్వయం చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. బాధితుల కుటుంబ సభ్యులు తన కార్యాలయాన్ని సంప్రదించవచ్చని, వారికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ప్రభుత్వ చర్యలతో బాధితులు త్వరలోనే సురక్షితంగా స్వదేశానికి తిరిగి వస్తారని ఆశాభావం వ్యక్తమవుతోంది.

## తెలుగు అమ్మాయిలతో స్కెచ్.. ఢిల్లీ కేంద్రంగా భారీ మోసం గుట్టురట్టు!

**మొదటిపేజీ తరువాయి..** ఢిల్లీ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న మూడు మోసపూరిత కాల్ సెంటర్లపై తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. బజాజ్ ఫైనాన్స్ పేరుతో రుణాలు ఇస్తామని నమ్మించి మోసాలకు పాల్పడుతున్న ఈ ముఠాకు సంబంధించి 22 మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో 21 మంది తెలుగు యువతులు, ఒక బ్యాంకు ఖాతాదారుడు ఉన్నారు. గత 18 నెలలుగా ఈ ముఠా చురుకుగా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. బజాజ్ ఫైనాన్స్ ప్రతినిధులుగా ఫోన్లు చేసి, ఆకర్షణీయమైన రుణాలను ఆమోదించినట్లు నమ్మించేవారు. ఆ తర్వాత ప్రాసెసింగ్ ఫీజులు, వెరిఫికేషన్ ఛార్జీలు, డాక్యుమెంటేషన్, ఇన్సూరెన్స్ వంటి పేర్లతో బాధితుల నుంచి డబ్బులు వసూలు చేసేవారు. ఈ మోసాలకు పాల్పడేందుకు నిర్వాహకులు ప్రత్యేకంగా తెలుగు మాట్లాడే యువతులనే నియమించుకున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. తెలంగాణలోని జగిత్యాల జిల్లా కోరుట్ల, హైదరాబాద్‌లోని సైదాబాద్, బోరబండ, మహబూబ్‌నగర్ ప్రాంతాల నుంచి యువతులను టెలీకాలర్లుగా రిక్రూట్ చేసుకున్నారు. లలిత్ సింగ్, కుల్దీప్ సింగ్, అనిల్ అనే ముగ్గురు వ్యక్తులు ఢిల్లీలోని శివ మార్కెట్ కేంద్రంగా ఈ కాల్ సెంటర్లను నడిపిస్తున్నారని, ప్రస్తుతం వారు పరారీలో ఉన్నారని అధికారులు తెలిపారు. ఈ ముఠాకు సంబంధించి తెలంగాణ వ్యాప్తంగా మొత్తం 22 సైబర్ క్రైమ్ కేసులు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఆపరేషన్ సందర్భంగా 23 మొబైల్ ఫోన్లు, రెండు బ్యాంకు పాస్‌బుక్‌లను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన యువతుల వయసు 20 నుంచి 42 ఏళ్ల మధ్య ఉంది. పరారీలో ఉన్న ప్రధాన సూత్రధారుల కోసం గాలింపు ముమ్మరం చేశామని, మనీ ట్రయల్‌పై దృష్టి సారించి మోసం పూర్తి స్థాయిని అంచనా వేస్తున్నామని పోలీసులు తెలిపారు.

# శ్రీవారి భజనల పేరడీ: పవన్ ఆదేశాలతో వైసీపీ ఎమ్మెల్సీపై జనసేన ఫిర్యాదు

**నేటి శుభోదయ, నెల్లూరు :**
భావాలను దెబ్బతీశారనే అభియోగంతో సోమవారం తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో వారు ఫిర్యాదును అందజేశారు. ఈ విషయంపై జనసేనాని, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆగ్రహం వ్యక్తం చేయడం తెలిసిందే. దేవుడి నామాలను పేరడీలతో కించపరిచేవారిపై చర్యలు తీసుకోవాలని పార్టీ శ్రేణులను ఆదేశించారు. ఈ క్రమంలో జనసేన నేతలు ఫిర్యాదు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. జనసేన తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి కిరణ్ రాయల్ ఈ ఫిర్యాదు అందజేసిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ, డీఎస్సీ నిరసన దీక్షలో పవిత్రమైన గోవింద నామాలను పరిహసించడం సనాతన ధర్మాన్ని అవమానించడమేనని మండిపడ్డారు. ఈ చర్య హిందువుల మనోభావాలను తీవ్రంగా గాయపరిచిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనకు బాధ్యులైన ఎమ్మెల్సీతో పాటు ఇతరులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) సైతం తక్షణమే స్పందించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర కార్యదర్శి ఆకేపాటి సుభాషిణి, నాయకులు హేమ కుమార్ కిశోర్, మనోజ్, సాయి దేవ్, సాయి, పురుషోత్తం, ఆది తదితరులు పాల్గొన్నారు. మత విశ్వాసాలను కించపరిచే ఇటువంటి చర్యలను ఎంతమాత్రం సహించకూడదని, చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. కాగా, ఆంధ్రప్రదేశ్‌లో మెగా డీఎస్సీ నియామక ప్రక్రియలో అవకతవకలు



జరిగాయని ఆరోపిస్తూ ప్రస్తుతం వైసీపీ నిరసనలు నిర్వహిస్తోంది.

# జిల్లాలోని రైతాంగ సమస్యలు పరిష్కరించాలి

**ఏలూరు, ఆగస్టు 10, నేటి శుభోదయ :** జిల్లాలోని రైతాంగ సమస్యలు పరిష్కరించాలని, మొక్కజొన్న విత్తన రైతులకు బకాయిలు చెల్లించాలని, కృష్ణా డెల్టాకు సాగునీరు విడుదల చేయాలని, ఉచిత పంటల బీమా పథకం అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం ఏలూరు అన్నే భవనంలో రైతు సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం ఆ సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు అధ్యక్షతన నిర్వహించారు. జిల్లాలోని పలు రైతాంగ సమస్యలు చర్చించారు. ఈ సందర్భంగా కె. శ్రీనివాస్ మాట్లాడుతూ మొక్కజొన్న విత్తన రైతులకు కంపెనీలు బకాయిలు చెల్లించకుండా నిర్లక్ష్యం చేయడం వలన రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులను చీటింగ్ చేసిన కంపెనీలపై చట్ట ప్రకారం తగు చర్యలు తీసుకోవాలని కోరారు. రైతుల బకాయిలు ఇప్పించాలని డిమాండ్ చేశారు.కృష్ణా డెల్టాకు సాగునీరు విడుదల చేయకపోవడం వలన రైతులు,కౌలు రైతులు వేసిన వరి నారు మళ్ళు, నాట్లు వేసిన చేలు ఎండిపోతున్నాయని, కృష్ణ డెల్టా రైతాంగం దిక్కుతోచని స్థితిలో అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్టులకు వస్తున్న నీరును కృష్ణా డెల్టా విడుదల చేసి వరి సాగుకు అవకాశం కల్పించాలని కోరారు. ఉచిత పంటల బీమా పథకం అమలు చేయాలన్నారు.



ప్రీమియం పెద్ద రైతులకు, కౌలు రైతులకు భారంగా ఉందని, రాష్ట్ర ప్రభుత్వమే పంటల బీమా ప్రీమియం చెల్లించాలన్నారు. వర్జీనియా పొగాకు గిట్టుబాటు ధర కల్పించాలని, సరాసరి ధర కిలోకు రూ.310 అమలు చేయాలని డిమాండ్ చేశారు. పొగాకు రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని కోరారు. తాడిపూడి ఎత్తిపోతల పథకం ఆయకట్టు రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించాలన్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించకపోతే రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కోన శ్రీనివాస రావు, జిల్లా కమిటీ సభ్యులు గుర్రం రాంబాబు, పలువురు రైతు సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వరుస దొంగతనాల కేసుల్లో ఇద్దరికి 6 నెలల జైలు శిక్ష

**కాకినాడ, ఆగస్టు 10, నేటి శుభోదయ :** కాకినాడ జిల్లా ఎస్పీ శ్రీ జి. బిందు మాధవ్, ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు, పెద్దాపురం డీఎస్పీ, జగ్గంపేట సీఐ గార్ల పర్యవేక్షణలో దొంగతనాల కేసుల దర్యాప్తు, కోర్టు విచారణలను వేగవంతంగా నిర్వహిస్తున్న క్రమంలో వరుస దొంగతనాలకు పాల్పడిన ఇద్దరు నిందితులకు కోర్టు జైలు శిక్ష విధించింది.గండేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మురారి, గండేపల్లి, తాళ్లూరు, ఎల్లమిల్లి, జడ్. రాగంపేట గ్రామాల్లో వరుస దొంగతనాలకు పాల్పడిన షేక్ అజీజ్ అలియాస్ నానీ, యడ్ల ఉషా సూర్య వెంకట రాజేష్‌లను 2022–2023 సంవత్సరాల్లో అప్పటి గండేపల్లి ఎస్ఐ వై. గణేష్ కుమార్ అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు.నిందితులపై గండేపల్లి పోలీస్ స్టేషన్‌లో నమోదైన Crime No.266/2022, 29/2023, 88/2023, 110/2023, 111/2023, 112/2023 కేసులకు సంబంధించి చార్జ్‌షీట్లు న్యాయస్థానంలో దాఖలు చేశారు.కోర్టు విచారణలో ప్రభుత్వ తరఫున ఏపీపీ ఎల్. లీలానాగరోజా బలమైన వాదనలు వినిపించగా, గండేపల్లి పోలీసులు కేసులను సమర్థవంతంగా పర్యవేక్షించారు. దీంతో నేరం రుజువుకావడంతో పెద్దాపురం గౌరవ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఇద్దరు నిందితులకు ఒక్కో కేసులో ఒక్కొక్కరికి ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు.కేసును సమర్థవంతంగా దర్యాప్తు చేసి, కోర్టులో శిక్ష పడేలా కృషి చేసిన గండేపల్లి ఎస్ఐ యు.వి. శివనాగ బాబు, పోలీస్ సిబ్బంది, ప్రభుత్వ న్యాయవాది ఎల్. లీలానాగరోజా గారిని ఉన్నతాధికారులు అభినందించారు.

# చిన్న వయసులోనే అద్భుతమైన సాహసం

**నంద్యాల, ఆగస్టు 10, నేటి శుభోదయ :** చిన్న వయస్సులోనే పట్టుదల, ధైర్యం, ఆత్మ విశ్వాసం, దేశభక్తి తో అద్భుతమైన సాహసం చేసి ఆఫ్రికా ఖండం లోని అత్యంత ఎత్తైన పర్వతం మౌంట్ కిలిమంజారోఅధిరోహించి ఉహూర్ పీక్ ను చేరుకున్న అరవ్ రెడ్డి నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి చెల్లెలు, టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే, బైరెడ్డి రాజశేఖరరెడ్డి కూతురు శర్వాణి పెద్ద కుమారుడు నేటి తరానికి స్ఫూర్తి గా నిలిచారు.అంతేకాకుండా, 9,600 చదరపు అడుగుల భారీ త్రివర్ణ పతాకాన్ని మోసుకుంటూ కిలిమంజారో ఉహూరు పీక్ ను చేరి, భారతదేశ ఔన్నత్యాన్ని ఆఫ్రికా ఖండంలోని అత్యున్నత శిఖరంపై చాటిచెప్పడం మరింత గర్వకారణం."నేను చేయలేను" అనే మాటను "నేను చేసి చూపిస్తాను"గా మార్చుకుంటూ, ఎన్నో సవాళ్లను అధిగమించి ఈ అద్భుత



సాహసాన్ని పూర్తి చేశారు. ఈ ఘనతకు గుర్తింపుగా UNICO World Records నుంచి వరల్డ్ రికార్డు సర్టిఫికెట్‌ను అందు కున్నారు.చిన్న వయసులోనే ఇంతటి ఘనత సాధించిన ఆరవ్ రెడ్డి పట్టుదల,




ధైర్యం, ఆత్మవిశ్వాసం, దేశభక్తి నేటి తరానికి ఎంతో గొప్ప స్ఫూర్తిదాయకం. సాహస వీరుడు ఆరవ్ రెడ్డిని పలువురు అభినందించారు.

# పెడనలో పోక్సో కేసు

- ఇద్దరు నిందితులు అరెస్ట్
- గురుకుల బాలికలపై అత్యాచారం ఘటనతో పెడనలో తీవ్ర కలకలం
- నిందితులపై పోక్సో చట్టంతో పాటు పలు సెక్షన్ల కింద కేసు నమోదు
- నిందితులను మీడియా ముందు ప్రవేశ పెట్టిన... ఎస్పీ విద్యాసాగర్ నాయుడు



**మచిలీపట్నం, ఆగస్టు 10, నేటి శుభోదయ :** మచిలీపట్నం రుద్రవరంలోని టిడ్కో హౌసెస్ వద్ద బాలికలపై అత్యాచారం నిందితులుగా శారదానగర్ కు చెందిన ఆటో డ్రైవర్లు మద్దాల శ్యామ్ కిరణ్ (20), కొక్కిలిగడ్డ సిద్దు(20) గుర్తించామని, నిందితులిద్దరినీ అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలిస్తున్నట్టు ఎస్పీ విద్యాసాగర్ నాయుడుపేర్కొన్నారు.ఈనెల 6వ తేదీన పెడన మండలం బల్లిపర్రు గురుకుల పాఠశాల నుంచి అదృశ్యమైన ఇద్దరు విద్యార్థినుల విషయం తెలిసిందే.40 రోజుల్లో కేసు విచారణ పూర్తి చేసి కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు చేస్తామని వెల్లడించారు.

# యాడికిలో వాల్మీకి సంఘం నూతన కార్యాలయం ప్రారంభం

**యాడికి, ఆగస్టు 10, నేటి శుభోదయ :** మండల కేంద్రమైన యాడికిలో రాష్ట్ర వాల్మీకి సంఘం అధ్యక్షులు చక్రాల శ్రీనివాసులు ఆదేశాల మేరకు నూతన వాల్మీకి కార్యాలయాన్ని ఘనంగా ప్రారంభించారు.వాల్మీకి సమాజం యొక్క హక్కులు, సంక్షేమం మరియు ఐక్యత లక్ష్యంగా ఈ సంఘాన్ని ఏర్పాటు చేసినట్లు పలువురు నాయకులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన వాల్మీకి మండల అధ్యక్షులు పి. రవికుమార్, బి. నాగు, కే. రంగ, అనంతపురం జిల్లా యూత్ అధ్యక్షులు పి. ప్రసాద్, బి. బి. శ్రీనివాసు, యాడికి మండల యువత అధ్యక్షులు సి. రవిశంకర్, పి. మధులకు పలువురు వాల్మీకి సోదరులు శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం నూతన నాయకులు మాట్లాడుతూ... వాల్మీకి కులస్తుల అభివృద్ధికి నిరంతరం పాటుపడతామని, విద్యా ఉద్యోగ రంగాల్లో తగిన గుర్తింపుతో పాటు ప్రభుత్వ సహాయం అందేలా కృషి చేస్తామని స్పష్టం చేశారు. అలాగే మహర్షి వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించడంతో పాటు సమాజంలో ఇబ్బందుల్లో ఉన్న వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు. ఇదే వేదికపై బోయ





వాల్మీకి ఐక్యత పోరాట సమితిని కూడా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని పలువురు వాల్మీకి సోదరులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎల్ నినో ప్రభావం అధిగమించేలా రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు

**యాడికి, ఆగస్టు 10, నేటి శుభోదయ :** మండలం పరిధిలోని యాడికి, వేములపాడు, రాయలచెరువు, చందన గ్రామాల్లో వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల బృందం సంయుక్తంగా పర్యటించి పంటలను పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న ఎల్ నినో బెట్ట పరిస్థితులను అధిగమించడానికి కంది, ప్రతి పంటలలో లీటరు నీటికి 5 గ్రాముల చొప్పున పొటాషియం నైట్రేట్ కలిపి, ఎకరానికి 200 లీటర్ల ద్రావణ్ని పిచికారీ చేయాలని రైతులకు సూచించారు.కంది పంటలో మొక్కల సాంద్రతను తగ్గించడం ద్వారా ఎక్కువ దిగుబడి సాధించవచ్చని తెలిపారు. ఒత్తుగా ఉన్న మొక్కలను తొలగించి, వరుసలో మొక్కల మధ్య 20 సెంటీమీటర్ల దూరం ఉండేలా చూసుకోవాలన్నారు. విత్తిన 30, 60 రోజులకు గుంటక లేదా గొర్రుతో అంతరకృషి చేయడం ద్వారా కలుపును నివారించడమే కాకుండా నేలలో తేమను కాపాడుకోవచ్చని పేర్కొన్నారు.అలాగే ప్రత్తి పంటలో పచ్చదోమ ఉనికిని గమనించామని, నివారణకు ఎకరానికి 60 గ్రాముల ఫ్లోనికామిడ్ పురుగుమందును వాడాలని సూచించారు. రాబోయే రోజుల్లో మినుములు, పెసర, ఉలవ వంటి ప్రత్యామ్నాయ పంటలు వేసేందుకు సిద్ధం కావాలని మండల వ్యవసాయ అధికారి మహబూబ్ బాషా కోరారు. బోరు బావుల్లో నీటిమట్టం తగ్గకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ కిషోర్, వ్యవసాయ కళాశాల అధ్యాపకులు డాక్టర్ కవిత, డాక్టర్ సుస్మిత, డాక్టర్



మీరా దేవి, రైతు సేవా కేంద్రం సిబ్బంది విజయలక్ష్మి , జయలక్ష్మి , రమేష్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# పేద కళాకారులకు పెన్షన్ల పంపిణీ

## - హాస్య నటుడు నరహరశెట్టి ప్రసాద్ కు సన్మానం



**గుడివాడ, ఆగస్టు 10, నేటి శుభోదయ :**
గుడివాడ కళాకారుల సమాఖ్య ప్రతినెల పేద వృద్ధ కళాకారులకు నెలవారి పెన్షన్ లను అందించటం జరిగిందని కళాకారుల సమాఖ్య సభ్యులు తెలిపారు. అదేవిధంగా గుడివాడ అల్లూగా పేరొందిన ప్రముఖ రంగస్థల నటులు, బహుముఖ నటనా ప్రజ్ఞాశాలి, గుడివాడ మున్సిపాలిటీ మాజీ ఉద్యోగులు, కళాకారులకు అత్యంత ఆత్మీయ బంధువు నరహరిశెట్టి ప్రసాద్ గతంలోనే కాక ఇటీవల తిరుపతిలో జరిగిన పరిషత్ పోటీలలో రెండవసారి ఉత్తమ హాస్య నటులుగా అవార్డు పొందిన సందర్భంగా కళా కారులు సమాఖ్య తరపున చిరు సత్కారము చేయటం జరిగినదన్నారు. ఈ సందర్భంగా విచ్చేసినటువంటి కళాకారులకు కళాభిమానులకు ప్రతినెలా పెన్షన్ ఇచ్చుటకు ఆర్థిక సహకారం అందించినటువంటి దాతలు అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాకారుల సమాఖ్య గౌరవాధ్యక్షులు బి రామ్మోహన్ రెడ్డి, అధ్యక్షులు వి. సత్యనారా యణ, కార్యదర్శి టి ఎస్ బాబు, కోశాధికారి ఏ సాంబశివరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ బివి సత్యం, సభ్యులు అమ్ముల సువర్ణ, డి వరలక్ష్మీ , టేకు నాగరాజు, శనగపాటి నాగేశ్వరరావు,పోలిశెట్టి రమణ శ్రీరంగం తదిత రులు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో పాల్గొని పెన్షన్ అందించిన దాత పాపనబోయిన వెంకటేశ్వర్లు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# కేంద్ర హోం మంత్రి అమిత్ షా ను మర్యాద పూర్వకంగా తోటి ఎంపీ లతో కలిసి



**నంద్యాల, ఆగస్టు 10, నేటి శుభోదయ :**
న్యూ ఢిల్లీలో సోమవారం సహచర తెలుగు దేశం పార్టీ (టిడిపి) పార్లమెంట్ సభ్యులతో కలిసి మర్యాద పూర్వకంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా ను ఆయన కార్యాలయంలో కలవడం జరిగిందని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగు దేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి తెలిపారు.ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి ప్రాధాన్యత, అభివృద్ధి, భవిష్యత్ దార్శనికతను ప్రతిబింబించే పుస్తకాన్ని హోంమంత్రి కి అందజేశా మని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు.

# ఎమ్మెల్యే సురేంద్రబాబుని కలిసిన దొనస్వామి



**అనంతపురం, ఆగస్టు 10, నేటి శుభోదయ :**
కళ్యాణదుర్గం నియోజకవర్గ శాసనసభ్యులు అమిలి నేని సురేంద్రబాబు ని మర్యా దపూర్వకంగా కలిసిన అనంతపురం జిల్లా నూతన కురుబ సంఘం అధ్యక్షులు దొనస్వామి..పార్టీలకు అతీతంగా మా కులానికి సంబంధించిన ఏ సమస్య వచ్చినా కూడా దయచేసి మీ ఆధ్వర్యంలో పరిష్కరించాలని మనస్ఫూర్తిగా కోరిన దొనస్వామి.మీకు ఏ సమస్య వచ్చినా కూడా, ఒక అన్నలాగా, ఒక మీ కులస్తు డిగా, ఒక తమ్ముడు లాగా, బంధువులాగా అన్ని విషయాల్లో మీకు తోడుగా ఉండి సహకరిస్తానని హామీ ఇచ్చిన సురేంద్రబాబు. ఆ హామీతో సంతోషం వ్యక్తం చేసిన కురుబ కుల బంధువులు..స్వయంగా సురేంద్రబాబు దోనస్వామి కి అనంతపురం జిల్లా కురువ సంఘం అధ్యక్షులు గా పదవి స్వీకరించడం సందర్భంగా స్వీట్ తినిపించడం అందరూ సంతోషం వ్యక్తం చేశారు.

# డీఎస్సీ అక్రమాలపై వైఎస్ఆర్సిపి ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

- డబ్బులకు అమ్ముకున్న అభ్యర్థులను ఉద్యోగాల నుంచి తొలగించాలి
- ఈ మొత్తం వ్యవహారంపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్
- గత నాలుగు నెలలుగా నిరసనలు తెలుపుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదు
- కొడుకును కాపాడుకోవడానికే సీఎం చంద్రబాబు పోలీసులతో నోటీసులు ఇప్పిస్తున్నారు
- దమ్ముంటే వైఎస్సార్ లాగా సీఎం చంద్రబాబు,లోకేష్‌పై సీబీఐ విచారణ చేయించాలి





**గుడివాడ, ఆగస్టు 10, నేటి శుభోదయ :**
డీఎస్సీ ప్రక్రియలో జరిగిన అక్రమాలపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన నిరసన ర్యాలీ పోలీసుల ఆంక్షల నడుమ కొనసాగింది అనుమతి లేదని స్పష్టం చేస్తూ పోలీసులు కొడాలి నానికి అధికా రికంగా నోటీసులు అందజేశారు. అనంతరం రాజేంద్రనగర్‌లోని తన స్వగృహం నుంచి పార్టీ శ్రేణులతో కలిసి మాజీ మంత్రి కొడాలి నాని బయలుదేరి ఏలూరు రోడ్డులోని ర్యాలీ ప్రారంభ శిబిరానికి చేరుకున్నారు.ఈ సందర్భంగా కొడాలి నాని మాట్లాడుతూ డీఎస్సీలో జరిగిన అక్రమాలకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీలు చేపడుతున్నట్లు తెలిపారు. డబ్బులకు అమ్ముకున్న అభ్యర్థులను ఉద్యోగాల నుంచి తొలగించాలని, ఈ మొత్తం వ్యవహారంపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. గత నాలుగు నెలలుగా నిరసనలు తెలుపుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని తన కొడుకును కాపాడుకోవడానికే సీఎం చంద్రబాబు పోలీసులతో వైఎస్ఆర్సిపి నాయకులకు నోటీసులు ఇప్పిస్తున్నారని ఆరోపించారు.అర్ధరాత్రి వేళ ఇళ్లకు వెళ్లి పోలీసులు వైసీపీ నాయకులను బెదిరిస్తున్నారని మండిపడ్డారు.ఢిల్లీలో విద్యార్థుల నిరసనల దెబ్బకు ఓ మంత్రి రాజీనామా చేయాల్సి వచ్చిందని, ఇక్కడ కూడా అదే పరిస్థితి పునరావృతమవుతుందని హెచ్చరించారు. డీఎస్సీ అక్రమాలను తొక్కిపెట్టాలని చూస్తే ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వా నికి పరాభవం తప్పదని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పదింతలు అనుభవిస్తారని హెచ్చరించారు.అక్రమాలు జరగకపోతే సీబీఐ విచారణకు ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. వైసీపీ నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారు బహిరంగ చర్చల పేరుతో మంత్రి లోకేష్ అసలు విషయాన్ని పక్కదారి పట్టిస్తు న్నారని విమర్శించారు. దమ్ముంటే అధికారంలో ఉండి సీబీఐ విచారణను ఎదుర్కొని నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాలని సవాల్ విసిరారు.కోర్టులకు వెళితే తీర్పు రావడానికి 25 ఏళ్లు పడుతుం దని, ఉద్యోగాలు వచ్చిన వారు అప్పటికి రిటైర్ అయిపోతారని పేర్కొన్నారు. అదే సీబీఐ విచారణ అయితే ఆరు నెలల్లో పూర్తవు తుందని తెలిపారు. పరిటాల రవి హత్య కేసులో అప్పట్లో చంద్రబాబు కోరితే, నాటి ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర రెడ్డి సీబీఐ విచారణకు ఆదేశించారని గుర్తుచేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకలా, అధికారంలోకి వచ్చాక మరోలా చంద్రబాబు వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. దమ్ముంటే వైఎస్సార్ లాగా సీఎం చంద్రబాబు, లోకేష్‌పై సీబీఐ విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. తమది జెన్–జి ఉద్యమం కాదంటున్నారని,ఢిల్లీలో కూడా మొదట అలాగే చెప్పి చివరికి రాజీనామా చేయాల్సి వచ్చిందని వ్యాఖ్యానించారు.ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# క్రీడా పోటీల్లో మెరిసిన విజన్ స్కూల్ విద్యార్థి శ్రీరంగ కుమార్

**యాడికి, ఆగస్టు 10, నేటి శుభోదయ :**
అనంత ఛాంపియన్‌షిప్ లో భాగంగా తాడపత్రి పట్టణంలోని అరబిందో పాఠశాల ప్రాంగణంలో ఘనంగా నిర్వ హించిన నియోజకవర్గ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో యాడికికి చెందిన 'విజన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్' విద్యార్థి కే. శ్రీరంగ కుమార్ అద్భుత ప్రతిభ కనబరిచాడు. వివిధ పాఠశాలల నుంచి పెద్ద సంఖ్యలో క్రీడాకారులు హాజరైన ఈ పోటీల్లో శ్రీరంగ కుమార్ తన క్రీడా నైపుణ్యంతో అందరినీ ఆకట్టుకున్నాడు.పోటీలలో భాగంగా నిర్వహించిన 600 మీటర్ల రన్నింగ్ రేసు విభాగంలో తీవ్ర పోటీని తట్టుకుని మూడో స్థానం సాధించి కాంస్య పతకాన్ని, అలాగే డిస్కస్ త్రో విభాగంలో అత్యుత్తమ ప్రదర్శనతో రెండో స్థానంలో నిలిచి రజత పతకాన్ని కైవసం చేసుకు న్నాడు. ఒకే పోటీలో రెండు పతకాలు సాధించి నియోజకవర్గ స్థాయిలో పాఠశా లకు, యాడికి ప్రాంతానికి ఎంతో పేరు ప్రఖ్యాతులు తీసుకువచ్చాడు.ఈ సందర్భంగా విజేతగా నిలిచిన శ్రీరంగ కుమార్‌ను విజన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్, హెచ్‌ఎం, ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినం దించారు. క్రీడల్లో రాణించడం ద్వారా మానసిక, శారీరక దృఢత్వం లభిస్తుందని, భవిష్యత్తులో శ్రీరంగ కుమార్ జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ పాల్గొని మరింత





ఉన్నత శిఖరాలను అధిరోహించాలని యాజమాన్యం ఆకాంక్షించింది...

# మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోండి

**మచిలీపట్నం, ఆగస్టు 10, నేటి శుభోదయ :**
దివ్యజ్ఞాన సమాజం కొన్ని వందల సంస్థలతో సమాజ శ్రేయస్సు కొరకు మంచిని పెంపొందించడానికి దేశవ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సీనియర్ న్యాయవాది లంకిశెట్టి బాలాజీ తెలిపారు. సోమవారం మచిలీపట్నం దివ్యజ్ఞాన సమాజం ఆల్కట్ లాడ్జి ఆధ్వర్యంలో నియోజకవర్గ పరిధిలోని చిన్నాపురం గ్రామహైస్కూల్ లో నైతిక విలువల విజ్ఞాన సదస్సులో పాల్గొని మాట్లాడుతూ జిల్లాప రిషత్ విద్యార్థులు అందరు విద్యార్థి దశనుండే నైతిక విలువలతో పెరగాలని బాలాజీ సూచించారు. ప్రతి విద్యార్థి ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు అగ్ర పీఠం వేయాలని చట్ట వ్యతిరేక చర్యలకు దూరంగా ఉండాలని బాలాజీ సూచించారు. విద్యార్థినిలకు పోక్సో చట్టం పట్ల అవగాహన కల్పించి ఇటీవల జరిగిన కొన్ని కేసులలో మైనర్లు ఏ విధంగా నేరస్థులుగా మారింది ఉదాహరణలతో తెలియ జేశారు. ప్రతి విద్యార్థి తన జీవితంలో దిశా నిర్దేశం చేసుకొని ఎదగా లని బాలాజీ అన్నారు. కృత్తివెన్ను మండలం చిన్న గొల్లపాలెం లో నిరుపేద కుటుంబంలో జన్మించిన ముత్యాల రాజు తన ప్రతిభతో o ఐఏఎస్ సాధించి నేడు ముఖ్యమంత్రి కార్యాలయంలో రాష్ట్రానికి సేవలు అందిస్తున్నారు అని బాలాజీ తెలియజేశారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసం పెంచుకోవాలని, ఆత్మహత్యలకు దూరంగా ఉండాలని బాలాజీ అన్నారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది కలిగిన తక్షణమే ఉపాధ్యాయులు తల్లిదండ్రులను దృష్టికి రావాలని బాలాజీ తెలియజే శారు. 18 సంవత్సరాలు నిండకుండా విద్యార్థులు ఎవరు వాహనాలు నడపరాదని బాలాజీ తెలియజేశారు. చిన్నాపురం హైస్కూలు గత నాలుగు సంవత్సరాలుగా అత్యున్నత విద్య ప్రమాణాలతో ముందుందని అందుకు కృషి చేస్తున్న అధ్యాపక బృందం అభినంద నీయమని అన్నారు. పెడన మండల విశ్రాంత విద్యాశాఖ అధికారి



కారుమూరి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ సమాజంలో నైతిక విలువలు తగ్గిపోవటం అత్యంత బాధాకరమని భారతీయ సంస్కృతి సాంప్రదాయాల ప్రకారం విలువలతో కూడిన జీవితాలను అలవాటు చేసుకోవాలని అన్నారు. విద్యార్థి దశలో సెల్ఫోన్ కు దూరంగా ఉండాలని అవసరం అయితే చదువు కోసం ఉపయోగించుకోవాలని సూచించారు. సంస్థ ప్రధాన కార్యదర్శి కొత్తగుండు రమేష్ మాట్లాడుతూ తమ సంస్థ విద్యాలయాల్లో కార్యక్రమాలు ఏర్పాటు చేసి నైతిక విలువలతో సమాజాన్ని మంచి మార్గంలో ఉంచడానికి కృషి చేస్తుందని తెలియజేశారు.హైస్కూల్ ఇన్చార్జి ప్రధానోపాధ్యా యురాలు నల్లరి అనురాధ మాట్లాడుతూ విద్యార్థుల మధ్య నైతిక విలువల కోసం అంతర్జాతీయ సంస్థ చిన్నాపురంలో సదస్సు ఏర్పాటు చేయటం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో దివ్యజ్ఞాన సమాజం సభ్యులు రాఘవేంద్రరావు హై స్కూలు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# వైసీపీ ప్రభుత్వంలో ఒక డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వలేదు

**అనంతపురం, ఆగస్టు 10, నేటి శుభోదయ :**
రాష్ట్రంలో ఎక్కడ చూసినా చేతకాని వైసీపీ నాయకులు రోడ్లపైకి వచ్చి సభలు పెట్టి కూటమి ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారని ఇది మంచి పద్ధతి కాదని అనంతపురం మార్కెట్ యార్డ్ చైర్ పర్సన్ బల్లాపల్లవి పేర్కొన్నారు. అనంతపురం నగరంలోని మార్కెట్ యార్డు కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ ఒక్కసారి మీరు గతంలో మీ నాయకుడు ఏం చెప్పారో వాటిని వెనక్కి వెళ్లి చూసుకుంటే, మీకే సమాధానం దొరుకుతుంది. అని మీ అందరికీ తెలియజేయడం జరుగుతోంది. ఎందుకంటే గతంలో మీ నాయకుడు ప్రభుత్వం ఏర్పాటు చేయడం కోసం మాయమాటలు చెప్పి, ఆ రోజు ఏ విధంగా అయితే గద్దెనెక్కారో, ఆ తర్వాత మాట తప్పారో మీ అందరికీ కూడా తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. 2014లో చంద్రబాబు నాయుడు 9,061, 2018లో 7,729 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశారు. మీ నాయకుడు ప్రభుత్వం ఏర్పడిన తర్వాత డీఎస్సీ ఇస్తామని మాయమాటలు చెప్పి గద్దెనెక్కారు. కానీ ఐదేళ్ల పాలనలో ఒక్కరోజు కూడా డీఎస్సీ గురించి పట్టించుకోకుండా, ఒక్క పోస్టు కూడా ఇచ్చిన పాపాన పోలేదు. అదేవిధంగా 2024లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి సంతకం డీఎస్సీపైనే చేస్తామని చెప్పినట్టుగానే చేసి, 16,347 పోస్టులతో డీఎస్సీని ముందుకు తీసుకొస్తే వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి కోర్టుకు వెళ్లి కేసులు వేశారన్నారు.వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి ఎన్ని ఇబ్బందులు పెట్టినప్పటికీ, టిడిపి అధినేత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చివరకు 16,347 పోస్టులతో డీఎస్సీని ముందుకు తీసుకొచ్చారు. ఎంతో మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించిన మా నాయకుడు ఎక్కడ? ఐదేళ్ల పాటు డీఎస్సీ గురించి పట్టించుకోకుండా ఉన్న మీ నాయకుడు ఎక్కడ? ఈరోజు మీరు దగా డీఎస్సీ పేరుతో రోడ్డెక్కితే అన్నీ నిజాలు అయిపోతాయని అనుకుంటున్నారా? అతి త్వరలో మరో డీఎస్సీని కూడా విడుదల చేసి, మరింత మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చైర్ పర్సన్ బల్లా పల్లవి స్పష్టం చేశారు. డీఎస్సీ అంటే టీడీపీ.. టీడీపీ అంటే డీఎస్సీ అని, 1995 నుంచి 2004



వరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 9 ఏళ్లలో ప్రతి ఏడాది డీఎస్సీ నోటిఫికేషన్లు విడుదల చేసి లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారని అన్నారు. 2014 నుంచి 2019 వరకు వేలాది మందికి డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి ఉద్యోగాలు భర్తీ చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని మార్కెట్ యార్డ్ చైర్పర్సన్ బల్లా పల్లవి హెచ్చరించారు.

# నిర్ణీత గడువులో నాణ్యమైన పరిష్కారం చూపాలి

**మచిలీపట్నం, ఆగస్టు 10, నేటి శుభోదయ :**
ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ప్రజల నుంచి అందిన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా నిర్ణీత గడువులోగా నాణ్యమైన పరిష్కారం చూపాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజి అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక–మీ కోసం కార్యక్రమాన్ని నిర్వహించిన కలెక్టర్, జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రతి అర్జీదారుడి సమస్యను ఓపికగా ఆలకించి, సమస్య పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం నవీన్, డిఆర్ఓ కే శ్రీధర్ రెడ్డి, కె ఆర్ ఆర్ సి ఎస్డిసి పి నీలకంఠేశ్వరరెడ్డి, మహిళా పోలీస్ స్టేషన్ ఎస్సై వాకా వెంకటేశ్వరరావుతో కలిసి ఆయన అర్జీలు స్వీకరించారు.అధికారుల వద్దకు చేరిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని అర్జీదారులకు సంతృప్తికరమైన పరిష్కారం అందించాలని కలెక్టర్ సూచించారు. అర్జీల పరిష్కార ప్రక్రియను అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ, నిర్ణీత గడువులోగా చర్యలు పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

**అర్జీలలో కొన్ని**
విన్నకోట గ్రామపంచాయతీ పరిధిలోని 14 చెరువుల లీజు ద్వారా వచ్చే ఆదాయాన్ని పెంచాలని అర్జీదారు కోరారు. గతంలో రూ.24.22 లక్షలు, రూ.27.16 లక్షలు ఆదాయం రాగా, ప్రస్తుతం 2026–29 కాలానికి కేవలం రూ.9.50



లక్షలకే లీజు నిర్ణయించడంతో పంచాయతీ ఆదాయం తగ్గిందని పేర్కొన్నారు. గతంలో జరిగిన అక్రమాలపై విచారణ జరిపి, 14 చెరువులను బహిరంగ వేలం ద్వారా నిర్వహించి గ్రామపంచాయతీ ఆదాయాన్ని పెంచాలని గుడ్లవల్లేరు మండలం విన్నకోట గ్రామస్తులు కలెక్టర్ ను కోరారు. కార్యక్రమంలో డిఆర్డిఏ, మెప్మా పీడీలు హరిహర నాథ్, సాయిబాబు, ఆర్ అండ్ బి ఈఈ లోకేశ్వరావు, ఎల్డిఎం రవీంద్రారెడ్డి, మత్స్య శాఖ అధికారి అయ్యా నాగరాజా, ఐసిడిఎస్ పిడి ఐ విమల, వ్యవసాయ శాఖ జేడి జ్యోతి రమణి, డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ పి ఎల్ దయాకర్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ సోమశేఖర్, సర్వే ఏడి లక్ష్మణరావు, డ్రైనేజీ శాఖ ఈఈ కిరణ్ బాబు, డ్వామా పీడీ ఎన్ శివప్రసాద్ యాదవ్, మార్క్ఫెడ్ డిఎం మురళీ కిషోర్, మార్కెటింగ్ ఏడి నిత్యానంద్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రాప్తాడులో విద్యార్థులు, నిరుద్యోగులు, యువత భారీ ర్యాలీ

**అనంతపురం, ఆగస్టు 10, నేటి శుభోదయ :**
రాప్తాడు నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పిలుపు మేరకు విద్యార్థులు, నిరుద్యోగులు, యువత ఆధ్వర్యంలో రాప్తాడు మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా రాప్తాడు నియోజకవర్గ సీనియర్ నాయకులు తోపుదుర్తి ఆత్మారామి రెడ్డి , రాప్తాడు మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాల లువేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు, నిరుద్యోగులు, యువతతో కలిసి వైఎస్సార్ విగ్రహం నుంచి బస్టాండ్ సర్కిల్ వరకు భారీ ర్యాలీగా వెళ్లి తమ డిమాండ్లను నినదించారు.డీఎస్సీ–2025 నియామకాల్లో చోటుచేసుకున్న అక్రమాలపై తక్షణమే సీబీఐ విచారణ చేపట్టి, అర్హత ఉన్న అభ్యర్థులకు వెంటనే న్యాయం చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. మెరిట్ సాధించిన అభ్యర్థుల భవిష్యత్తును



దెబ్బతీసే విధంగా జరిగిన అవకతవకలపై ప్రభుత్వం స్పష్టమైన సమాధానం చెప్పాలని కోరారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్–మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, విద్యార్థులపై ఆర్థిక భారం లేకుండా చర్యలు తీసుకోవాలనీ డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన నిరుద్యోగభృతి హామీని తక్షణమే అమలు చేసి నిరుద్యోగ యువతకు అండగా నిలవాలని కోరారు.ఈ సందర్భంగా తోపుదుర్తి ఆత్మారామి రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు, నిరుద్యోగులు, యువత సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజల తరఫున మరింత బలమైన ఉద్యమాన్ని చేపడుతుందని హెచ్చరించారు. హామీలు ఇవ్వడం మాత్రమే కాకుండా వాటిని అమలు చేయడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు..డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ అర్హులకు తక్షణ న్యాయం – ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపు – నిరుద్యోగ భృతి అమలు కోసం విద్యార్థులు, నిరుద్యోగులు, యువత పెద్ద ఎత్తున తమ నిరసనను తెలియజేశారు..

# డీఎస్సీ నిరసనపై కొడాలి నాని వాక్యాలకు గుడివాడ ఎమ్మెల్యే రాము ఘాటు కౌంటర్



**నందివాడ, ఆగస్టు 10, నేటి శుభోదయ :**
ప్రస్తుతం రాజకీయ అరెస్టులు లేవు, అరాచకవాదులు మాత్రమే జైలుకు వెళ్తున్నారని అన్నారు.. రాష్ట్ర ప్రజలకు మంచి జరుగుతుంటే గొడ్డలి పార్టీకి ఇష్టం ఉండదని అన్నారు. డీఎస్సీలో తప్పులు జరగలేదని కోర్టులే చెబుతున్నాయని అయినా సీబీఐ విచారణ అంటున్నారు. ఓపెన్ డిబేట్ కు సిద్ధమని లోకేష్ ఛాలెంజ్ చేశారు... సబ్జెక్టు అవగాహన లేకనే వారు రావడం లేదన్నారు.పనికిమాలిన చెత్త వాగుళ్లు తప్ప ప్రజలకు మంచి చేసే కార్యక్రమాలపై అవగాహన లేని వాళ్లు వైసీపీ నేతలని, గొడ్డలి పార్టీ నేతలు తమ గత పాలన ఒక్కసారి గుర్తు తెచ్చుకోవాలన్నారు.అధికారంలో ఉండగా లెక్కలేనన్ని అరాచకాలు చేశారు, అయినా ప్రజల పక్షాన మేము పోరాడామని, మాపై అన్యాయంగా ఎన్నో కేసులు పెట్టారని, అయినా వెనుకడుగు వేయలేదన్నారు. ప్రభుత్వ అనుమతి లేని కార్యక్రమాలకు నోటీసులు ఇవ్వడం సహజం. గుడివాడలో ఎవ్వరినీ ఆపలేదని, పోలీసులు చట్టం ప్రకారం ముందుకు వెళ్లారని, బయటకు వస్తే కేసుల గోల తప్ప మరొకటి మాట్లాడటం లేదన్నారు. అరెస్టు భయంతోనే ఇలా మాట్లాడుతున్నారని ఎద్దె వా చేశారు.ప్రతిపక్షంలో ఉండి రావి నాయకత్వంలో దమ్ముగా పోరాడాం అక్రమ కేసులు వేసినా కోర్టుల ద్వారా బయటకు వచ్చామన్నారు. చేతకాని ప్రతిపక్షం వైసీపీకి ప్రజల కోసం చేసేది ఏమీ లేదని, విద్వేషాలు రెచ్చగొట్టడమే తెలుసన్నారు.మాకు గుడివాడ అయినా, రాష్ట్రం అయినా అభివృద్ధి ముఖ్యం,ఎన్నికల సమయంలోనే రాజకీయాలు చేయాలన్నారు.చంద్రబాబు హయంలోనే టీచర్ రిక్రూట్‌మెంట్ జరిగింది... జీవితంలో ఒక్క టీచర్ పోస్ట్ అయినా ఇచ్చారా అని ప్రశ్నించారు..

**ఎస్డబ్ల్యుసి చైర్మన్ రావి వెంకటేశ్వరరావు కామెంట్స్**
డీఎస్సీ విషయంలో వైసీపీ పచ్చి అబద్ధాలు ఆడుతోందన్నారు.కోర్టు తిరస్కరించినా సిగ్గు లేకుండా రోడ్లెక్కుతున్నారు.పేద,మధ్యతరగతి వారు కష్టపడి సాధించిన ఉద్యోగాలను అవమానిస్తున్నారు.నీ గ్యాంగ్ చేసిన దోపిడీపై విచారణ తథ్యం... నీ డొల్ల బతుకు ప్రజలకు తెలుసన్నారు.పరిటాల రవి గురించి నీకేం సంబంధం... రావణ్ గురించి మాట్లాడతావ్... నీకు వాడికి లింకేంటని ప్రశ్నించారు.పిచ్చి వాగుళ్లు వద్దు రాజకీయాలు చేసుకో మని, ప్రతిపక్షంలో ఉండగా మేము తగ్గలేదని కేసులు పెట్టించుకున్నామన్నారు. కానీ నీలా చట్టాన్ని దాటలేదన్నారు.మీరు పద్ధతి తప్పితే మేమేంటో చూపిస్తామని హెచ్చరించారు.

# ఆషాడ సారె ముగింపు ఉత్సవాలు, స్వతంత్ర దినోత్సవ వేడుకలు గురించి ఈవో శీనా నాయక్ సమీక్షా సమావేశం



**విజయవాడ, ఆగస్టు 10, నేటి శుభోదయ :**
ఈనెల 12తో ఆషాఢ మాసం ముగియనున్న నేపథ్యంలో సోమవారం ఉదయం 8.30 కు దేవస్థానం సిబ్బంది సారె సమర్పణ కార్యక్రమం జమ్మిదొడ్డి నుండి ప్రారంభం అవుతుందని ఉద్యోగులు ఈవోకు తెలియజేసారు.ఈ నెల13 నుండి శ్రావణ మాసం సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని ఆర్జిత సేవగా కుంకుమార్చన, వరలక్ష్మి వ్రతం, ఉచితంగా సామూహిక వరలక్ష్మి వ్రతం నిర్వహణకు చర్యలు తీసుకోవాలని, దర్శనం క్యూ లైన్లు, త్రాగు నీరు, ఉచిత ప్రసాదం, అన్న ప్రసాదం విషయాలులో అన్ని పరిశీలన చేసుకొని సిద్ధం కావాలని ఈవో శీనా నాయక్ ఆదేశించారు.ఈ నెల 15న భారత స్వాతంత్ర దినోత్సవం వేడుకలు సందర్భంగా జరుగవలసిన ఏర్పాట్లు గురించి అన్ని విభాగాలకు బాధ్యతలు అప్పగించారు. ఈసారి ప్రధాన రాజ గోపురం ప్రాంగణంలో జెండా వందనం చేయడానికి, సిబ్బందికి అభినందన పురస్కారాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ సమావేశంలో వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## మార్కెట్ యార్డ్ ను పరిశీలించిన బల్లా పల్లవి



**అనంతపురం, ఆగస్టు 10, నేటి శుభోదయ :** మార్కెట్‌యార్డ్‌లో శనివారం, ఆదివారం సంతలో మిగిలి ఉన్న పశువులకు గడ్డి , తాగునీటి సౌకర్యం కల్పించారు. అనంతపురం నగర సమీపంలో ఉన్న మార్కెట్ యార్డ్ ను చైర్ పర్సన్ బల్లాపల్లవి పరిశీలించారు. ఆమె స్వయంగా పశువుల దగ్గరికి వెళ్లి గడ్డిని తీసుకొచ్చి పశువులకు అందించారు.అలాగే షెడ్ సమీపంలోని పైపులకు కాంక్రీట్ వేయించే పనులు చేపట్టాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.

## విలేకరి పై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలి
### : ఏపీయూ డబ్ల్యూజే డిమాండ్



**తాడేపల్లిగూడెం, ఆగస్టు 10, నేటి శుభోదయ :** విధినిర్వహణలో ఉన్న ప్రైమ్ 9 న్యూస్ ఛానెల్ విలేకరి నాని పై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని తాడేపల్లిగూడెం ప్రెస్ క్లబ్,ఏపీయూడబ్ల్యూజే డిమాండ్ చేసింది.ఈ మేరకు వినతిపత్రాలను తాడేపల్లిగూడెం ఆర్డిఓ, డిఎస్పి,రూరల్ సీఐ లకు సోమవారం వినతిపత్రాలు అందజేశారు. పత్రికా స్వేచ్ఛను కాపాడాలని, జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని,నిందితులను వెంటనే అరెస్టు చేయాలని నినాదాలు చేశారు. ఈ నిరసన కార్యక్రమం లో పలువురు పాత్రికేయులు మాట్లాడుతూ పెంటపాడు మండలం, కె పెంటపాడులో పెట్రోలు బంకు వద్ద కొందరు వ్యక్తులు ఘర్షణ పడుతుండగా విషయసేకరణ నిమిత్తం అక్కడికి వెళ్లిన ప్రైమ్ 9 రిపోర్టర్ చినమిల్లి నాగ వర ప్రసాద్ (నాని )పై దాడి చేయటం, పత్రికా స్వేచ్ఛపై దాడి చేయటమేనని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువు లాంటి పత్రికాస్వేచ్ఛను కాపాడుకోవాలని, పాత్రికేయులకు రక్షణ కల్పించాలని కోరారు. విలేఖరి పై దాడి చేసిన నిందితులను వెంటనే అరెస్ట్ చేసి చట్టపరమైన చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో జిల్లా,రాష్ట్ర స్థాయిల్లో ఏపీయూడబ్ల్యూజే ఉద్యమం చేస్తుందని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి గజపతి వర ప్రసాద్, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలడుగు సతీష్, సిటీ కేబుల్ మేనేజర్ వై.ఎన్.వి రమేష్, వివిధ వార్తాపత్రికలు,టీవీ ఛానళ్లు, యూ ట్యూబ్ ఛానళ్ల విలేకరులు పాల్గొన్నారు.

## శ్రీ జగన్మాత సన్నిధిలో కొనసాగుతున్న మహిళా భక్తుల రద్దీ



**విజయవాడ, ఆగస్టు 10, నేటి శుభోదయ :** శ్రీ కనకదుర్గమ్మ వారిని ఇంటి ఇలవేల్పుగా, ఆడపడుచుగా భావిస్తూ పసుపు, కుంకుమలు, గాజులు, చీర,సారెలతో ఇంద్ర కీలాద్రిపై ఆషాఢ సారె 27వ రోజు సోమవారం శ్రీ కనకదుర్గమ్మ వారి సన్నిధిలో వివిధ ప్రాంతాల నుంచి సారె తో తరలి వచ్చిన మహిళా భక్తులతో రద్దీ విశేషంగా పెరిగింది. సాయంత్రం 5 గంటల వరకు 37 సారె బృందాలు రాగా, 16984 మంది భక్తులు సారె ను సమర్పించారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళా భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. సారె బృందాలకు ఉచిత దర్శనంతో పాటు, వేద పండితులు వేదాశీర్వచనం అందజేసి, లడ్డు ప్రసాదాలను అందజేశారు.

## జిల్లా అధ్యక్షునిగా మరో సారి రాజహంసకే పట్టం కట్టిన కురుబ కులస్తులు



**అనంతపురం, ఆగస్టు 10, నేటి శుభోదయ :** అనంతపురం జిల్లా కురుబ సంఘం అధ్యక్షులుగా రాజహంస శ్రీనివాసుల కె మరొకసారి కురుబ కులస్తులు ఓటింగ్ ద్వారా ఎన్నుకున్నారు. ముగ్గురు అభ్యర్థులు పోటీలో నిలవగా రాజహంస శ్రీనివాసులకు మొత్తం 4 వేల ఓట్లు పోలు కాగా 3097 ఓట్లు రాజహంస శ్రీనివాసులకు మద్దతు తెలిపారు. రెండోసారి రాజ హంస శ్రీనివాస్ విజయ ఢంకా మోగించారు.శనివారం ఉదయం 11 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు ఓటింగు జరిగింది. 4 వేల మంది ఓటర్లు ఎన్నికల్లో పాల్గొన్నారు. కురుబ సంఘం జిల్లా అధ్యక్షులకు రాజహంస శ్రీనివాసులు, ఎస్కే మల్లికార్జున, బోరంపల్లి ఆంజనేయులు పోటీలో ఉన్నారు. 4 వేల మంది అనంతపురం జిల్లా కురుబ కులస్తులు ఓటింగ్లో పాల్గొనగా 3097 ఓట్లు రాజా హంస శ్రీనివాసులకు వేసినట్లు తెలుస్తోంది. ఎస్కే మల్లికార్జున కు 750 ఓట్లు, బోరంపల్లి ఆంజనేయులకు 110 ఓట్లు దక్కినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా రాజహంస శ్రీనివాసులు మాట్లాడుతూ అనంతపురం జిల్లా ఏడు నియోజకవర్గాల వారు శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు ఓట్లు వేశారని తనకు 3097 ఓట్లు దక్కాయని రెండవ స్తానంలో ఎస్కే మల్లికార్జున, మూడో స్థానంలో బోరంపల్లి ఆంజనేయులు ఉన్నారని ఆయన తెలిపారు. ఎస్కే మల్లికార్జున కు 750 ఓట్లు వచ్చాయని బోరంపల్లి ఆంజనేయులుకు 110 ఓట్లు వేశారని ఆయన స్పష్టం చేశారు. తనను 3097 ఓట్లు 78%తో అతి భారీ మెజార్టీతో గెలిపించినందుకు కురుబ కులస్తులకు కృతజ్ఞతలు తెలిపారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో కురుబ కులస్థులకు అత్యధికంగా జడ్పిటిసి, ఎంపీటీసీ, మున్సిపాలిటీ, నగర పాలక ఎన్నికల్లో రాజకీయ పార్టీలు అత్యధికంగా స్థానాలు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతపురం జిల్లాలో 2029లో జరగబోవు ఎన్నికలకు రాజకీయ పార్టీలు ఒక ఎంపీ ,ఒక ఎమ్మెల్యే సీట్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. కురుబలకు అత్యధిక స్థానాలు కేటాయించిన పార్టీకి తమ మద్దతు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కురుబ సంఘం నాయకులు కేసీ నాగన్న, పిడుగు కృష్ణమూర్తి, కొనకొండ్ల ఈశ్వరయ్య, ఎల్ఐసి వెంకటేశు, రామకృష్ణ లను ఉపాధ్యక్షులుగా, కార్యదర్శులుగా కోశాధికారిగా ఎన్నుకున్నట్లు రాజహంస శ్రీనివాసులు తెలిపారు.సామాజిక సేవా కార్యక్రమాల్లో పునీతుడైన రాజహంస రాజహంస శ్రీనివాస్ అంటే ఉమ్మడి జిల్లా వారికి సుపరిచితుడే . జిల్లాలో శ్రీనివాస్ అంటే చాలామందికి తెలియదు. అయితే రాజహంస అని మొదటి పేరు పిలిస్తే ప్రతి ఒక్కరూ గుర్తుపడతారు. రాజహంస పేరుతో జిల్లాలో ఎన్నో కన్స్ట్రక్షన్స్ చేసి నాణ్యత మైన క్వాలిటీతో అపార్ట్మెంట్లు నిర్మించారు. అందువల్ల రాజహంస శ్రీనివాస్ కు రాజహంస అనే పేరుతో పిలిస్తే చాలు జిల్లా ప్రజలంతా గుర్తిస్తారు. ఈ నేపథ్యంలో రెండో మారు ఎన్నికైన రాజ హంస శ్రీనివాసులు సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందంజలో ఉన్నారు. అనంతపురం జిల్లా నుంచి వచ్చే కురుబ కులస్తులకు ప్రత్యేకంగా తన అపార్ట్మెంట్లో ఉన్న గెస్ట్ హౌస్ ను ఇవ్వడం జరిగింది. అనంతపురం నగరంలోని ఏర్నాల కొట్టాలలో కురుబ విద్యార్థినిలకు ప్రత్యేకంగా హాస్టల్ ను ఏర్పాటు చేశారు. ప్రతిసారి గెలుపొందిన ప్రజా ప్రతినిధులకు సన్మాన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రతి ఏడాది డిగ్రీ పూర్తిచేసిన వారికి ప్రత్యేకంగా కోచింగ్ సెంటర్ను ఏర్పాటుచేసి కోచింగ్ ఇప్పించి వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలుస్తోంది. 2013 సంవత్సరం నుంచి ఇప్పటివరకు కురుబ విద్యార్థినిలకు ప్రత్యేకంగా కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేసి ట్రైనింగ్ ఇస్తూ వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు. కులమంతా ఐక్యంగా ఉండాలనే ఉద్దేశంతో 2023లో గుడికట్ల సంబరాలు భారీ ఎత్తున నిర్వహించారు. 250 గుడికట్లను తీసుకొచ్చి అనంతపురంలో సంబరాలు నిర్వహించి కురుబల చరిత్ర గురించి ప్రజలందరికీ వివరించారు. తమ సొంత నిధులతో రెండు కనకదాసు విగ్రహాలను తెప్పించి కనకధాశ విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఇటీవల ఎంబిబిఎస్ విద్యార్థినికి లక్ష రూపాయలు ఇవ్వడంతో పాటు ఎంబిబిఎస్ పూర్తయ్యే వరకు తాను ఆ విద్యార్థిని చదివిస్తానని హామీ ఇచ్చారు.

## 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 10 నుంచి 15 వరకు జిల్లాలో విస్తృతంగా 'నేషన్ బిల్డింగ్' కార్యక్రమాలు

**అనంతపురం, ఆగస్టు 10, నేటి శుభోదయ :** 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో'నేషన్ బిల్డింగ్ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఓ .ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లాలో' చేపట్టాల్సిన కార్యక్రమాలపై అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.....స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశ నిర్మాణంలో ప్రతి పౌరుడి భాగస్వామ్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఆగస్టు 10 నుంచి 15వ తేదీ వరకు ప్రజల భాగస్వామ్యంతో వివిధ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.దేశ నిర్మాణం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతను గుర్తించి చురుకుగా భాగస్వామి కావాలన్నారు.త్రివర్ణ కాంతులతో ప్రభుత్వ భవనాల అలంకరణఆగస్టు 14, 15 తేదీల్లో జిల్లాలోని ప్రభుత్వ భవనాలు, ప్రధాన ప్రదేశాలను జాతీయ పతాకంలోని మూడు రంగుల విద్యుత్ కాంతులతో అలంకరించాలన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు జిల్లావ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొనేలా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలన్నారు.80వ భారత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 13 నుంచి 15వ తేదీ వరకు 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. జిల్లాలోని ప్రతి ఇల్లు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద జాతీయ పతాకాన్ని ఎగురవేయాలన్నారు.ఆగస్టు 14న జిల్లావ్యాప్తంగా ఒకేరోజు విస్తృత స్థాయిలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు.అటవీ శాఖ సహకారంతో ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామాల్లోని ప్రముఖ ప్రదేశాలలో మొక్కలు నాటాలన్నారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యతను తీసుకోవాలన్నారు.పాఠశాలల్లో 'అనే నేను భవిష్యత్‌పై విద్యార్థుల ప్రతిజ్ఞఆగస్టు 10 నుంచి 15వ తేదీ వరకు ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రత్యేక తరగతుల ద్వారా 'అనే నేను' కార్యక్రమాన్ని నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులు భవిష్యత్తులో తాము ఏమి కావాలనుకుంటున్నారు, రాష్ట్రం, దేశ నిర్మాణంలో తాము ఎలాంటి పాత్ర పోషించాలనుకుంటున్నారు అనే అంశాలపై స్వయంగా ఆలోచించి తమ అభిప్రాయాలను వ్యక్తపరిచేలా ప్రోత్సహించాలన్నారు. ఉత్తమమైన, స్ఫూర్తిదాయకమైన ప్రతిజ్ఞలను ఎంపిక చేసి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రస్తావిస్తూ విద్యార్థులను ప్రోత్సహించాలని డిఇఓ ను ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఆగస్టు 15, కార్యక్రమాలను విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమాలకు సంబంధించిన ఫొటోలు, సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేయాలని సూచించారు.



# ఘన వ్యర్థాల నిర్వహణలో బల్క్ వేస్ట్ జనరేటర్లు బాధ్యత వహించాలి

**తాడిగడప, ఆగస్టు 10, నేటి శుభోదయ :** ఘన వ్యర్థాల నిర్వహణ విషయంలో బల్క్ వేస్ట్ జనరేటర్లు తమ ప్రాంగణాల్లోనే వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించే విధంగా చర్యలు చేపట్టాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజి సూచించారు. సోమవారం తాడిగడప మున్సిపాలిటీలో ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలు–2026, సుప్రీంకోర్టు ఆదేశాల అమలుపై వి.ఆర్. సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంల నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఘన వ్యర్థాల నిర్వహణ అనేది కేవలం పరిశుభ్రతకు సంబంధించిన అంశం మాత్రమే కాదని, ప్రతి సంస్థ, ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల్లోని కీలక అంశాన్ని ప్రస్తావిస్తూ, నిబంధనలు పాటించకుండా ఆదేశాలను ఉల్లంఘించే బల్క్ వేస్ట్ జనరేటర్లపై అవసరమైన సందర్భాల్లో విద్యుత్, నీటి సరఫరాను నిలిపివేసే స్థాయిలో చర్యలు తీసుకునేలా జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు ఉన్నాయని తెలిపారు.సుప్రీంకోర్టు ఆదేశాల స్ఫూర్తిని చిత్తశుద్ధితో అమలు చేయాల్సిన బాధ్యత జిల్లా యంత్రాంగంపై ఉందన్నారు. అందువల్ల నిబంధనలు పాటించని బల్క్ వేస్ట్ జనరేటర్లపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన పరిస్థితి రాకుండా, ముందుగా వారికి సరైన అవగాహన కల్పించి, తమ ప్రాంగణాల్లోనే తడి వ్యర్థాలను శాస్త్రీయంగా నిర్వహించేందుకు అవసరమైన సదుపాయాలు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు.





**తడి వ్యర్థాలను ప్రాంగణంలోనే ప్రాసెస్ చేయాలి**

బల్క్ వేస్ట్ జనరేటర్లు తమ ప్రాంగణాల్లోనే తడి వ్యర్థాల నిర్వహణకు తగిన సదుపాయాలను ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. తడి వ్యర్థాలను శాస్త్రీయంగా ప్రాసెస్ చేయడం ద్వారా సేంద్రీయ ఎరువు (కంపోస్ట్) తయారు చేసుకోవచ్చని, దానిని ఆయా ప్రాంగణాల్లో మొక్కలు, తోటల పెంపకానికి వినియోగించుకోవచ్చని తెలిపారు. దీంతో ఒకవైపు సంస్థలకు ఉపయోగకరమైన కంపోస్ట్ లభించడంతో పాటు, మరోవైపు గ్రామ పంచాయతీలు, మున్సిపల్ సంస్థలపై పడే వ్యర్థాల నిర్వహణ భారం తగ్గుతుందని చెప్పారు. స్థానిక సంస్థలు తమ వనరులను ఇతర పరిశుభ్రత కార్యక్రమాలపై వినియోగించి గ్రామాలు, పట్టణాలను మరింత పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు అవకాశం కలుగుతుందని తెలిపారు. మీ ప్రాంగణాల్లోనే తడి వ్యర్థాలను నిర్వహించండి. ఇది ప్రభుత్వానికి చేసే సహాయం మాత్రమే కాదు.. మీ సంస్థకు, మీ ప్రాంగణానికి, సమాజానికి కూడా మేలు చేస్తుంది" అని కలెక్టర్ పేర్కొన్నారు.

**బల్క్ వేస్ట్ జనరేటర్లకు 15–20 రోజుల గడువు**

ప్రతి బల్క్ వేస్ట్ జనరేటర్‌కు నిబంధనలు, సుప్రీంకోర్టు ఆదేశాలను స్పష్టంగా వివరిస్తూ వివరణాత్మక నోటీసులు జారీ చేయాలని పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ కమిషనర్లను కలెక్టర్ ఆదేశించారు.బల్క్ వేస్ట్ జనరేటర్లు తమ ప్రాంగణాల్లో వ్యర్థాల నిర్వహణకు అవసరమైన సదుపాయాలు ఏర్పాటు చేసుకునేందుకు 15 నుంచి 20 రోజుల గడువు ఇవ్వాలని సూచించారు. ఈ గడువు అనంతరం కూడా నిబంధనలు పాటించని సంస్థలపై తప్పనిసరి పరిస్థితుల్లో విద్యుత్, నీటి సరఫరా నిలిపివేతతో పాటు నిబంధనల ప్రకారం తదుపరి కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

**అవగాహనతో ప్రారంభించి, అవసరమైతే కఠిన అమలు**

గతంలో నిబంధనలు ఉన్నప్పటికీ బల్క్ వేస్ట్ జనరేటర్లపై తగిన స్థాయిలో దృష్టి పెట్టలేకపోయామని, అయితే ప్రస్తుతం సుప్రీంకోర్టు ఈ అంశాన్ని అత్యంత సీరియస్‌గా పరిగణిస్తున్న నేపథ్యంలో నిబంధనలను తప్పనిసరిగా అమలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని కలెక్టర్ తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల అమలుపై జిల్లా యంత్రాంగం తీసుకున్న చర్యలకు సంబంధించి నివేదికలు, అఫిడవిట్‌లు సమర్పించాల్సిన పరిస్థితి ఉన్నందున ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యతతో పరిగణిస్తున్నామని చెప్పారు. సుప్రీంకోర్టు ఆదేశాలను గౌరవిస్తూ, వాటి స్ఫూర్తితో ఘన వ్యర్థాల నిర్వహణను సమర్థవంతంగా అమలు చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు.

**గ్రీన్ రిచ్ సంస్థ ద్వారా ప్రాక్టికల్ డెమో**

బల్క్ వేస్ట్ జనరేటర్లకు తమ ప్రాంగణాల్లో తడి వ్యర్థాలను నిర్వహించేందుకు అందుబాటులో ఉన్న సాంకేతిక పరిష్కారాలపై అవగాహన కల్పించేందుకు చెన్నైకి చెందిన గ్రీన్ రిచ్ గ్లోబల్ సొల్యూషన్స్ సంస్థ ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు. తడి వ్యర్థాలను ప్రాసెస్ చేసి సేంద్రీయ ఎరువుగా మార్చే విధానాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించడంతో పాటు, ప్రత్యక్షంగా ప్రాక్టికల్ డెమో నిర్వహించారు. అయితే ఏ సంస్థకు చెందిన సాంకేతిక పరిష్కారాన్ని వినియోగించుకోవాలనే విషయంలో బల్క్ వేస్ట్ జనరేటర్లకు తమ అవసరాలకు అనుగుణంగా నిర్ణయం తీసుకునే స్వేచ్ఛ ఉందని, సదుపాయం ఏర్పాటు చేసి నిబంధనలు పాటించడం మాత్రం తప్పనిసరి అని కలెక్టర్ స్పష్టం చేశారు

**స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా సమన్వయంతో చర్యలు**

ఘన వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ 'స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో కూడా కీలక భాగమని కలెక్టర్ తెలిపారు. ప్రతి మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీ తమ పరిధిలోని బల్క్ వేస్ట్ జనరేటర్లను గుర్తించి, వారి నమోదు, వ్యర్థాల వేర్పాటు, తడి వ్యర్థాల ప్రాసెసింగ్, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.బల్క్ వేస్ట్ జనరేటర్లు, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు, సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేస్తేనే ఘన వ్యర్థాల సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, కృష్ణా జిల్లాను స్వచ్ఛమైన, పరిశుభ్రమైన జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి ఎం ధనలక్ష్మి , గుడివాడ, తాడిగడప, మచిలీపట్నం, ఉయ్యూరు మున్సిపల్ కమిషనర్లు మనోహర్ రావు, నజీర్, బాపిరాజు, సుభాష్ చంద్రబోస్, డివిజనల్ అధికారులు రామనాథం, సునీత శర్మ, స్వర్ణలత, డివిల్పిఓ లు మహమ్మద్ రజావుల్లా, సంపత్ కుమారి, కృష్ణా జిల్లాలోని 25 మండలాల డిప్యూటీ ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు, బల్క్ వేస్ట్ జనరేటర్ల ప్రతినిధులు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# జగన్ తీసుకొచ్చిన ల్యాండ్ టైటిల్ యాక్ట్‌తో రైతులకు తీవ్ర అన్యాయం



**అనంతపురం, ఆగష్టు 10, నేటి శుభోదయ :** రైతుల భూములకు రక్షణ కల్పిస్తూ, రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్ తీసుకొచ్చిన ల్యాండ్ టైటిల్ యాక్ట్ వల్ల రైతుల భూములపై అనేక అనుమానాలు, ఆందోళనలు నెలకొన్నాయని ఎంఎల్ఏ పల్లె సింధూర విమర్శించారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చంద్రబాబు నాయుడు సీఎం కాగానే జగన్ తీసుకొచ్చిన ల్యాండ్ టైటిల్ యాక్ట్ ను రెండవ సంతకంతో రద్దు చేశారు.నల్లమాడ తహాశీల్దార్ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి చేతుల మీదుగా వెళ్ళమద్ది పంచాయతీ చెందిన రైతులకు రైతులకు సుమారు 1147 పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ.. రైతుల భూములు వారికి సొంత హక్కుగా ఉండాలన్నదే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు బాధ్యతలు స్వీకరించిన వెంటనే రెండో సంతకంతో గత ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను రద్దు చేశారని తెలిపారు.రైతుల భూముల విషయంలో ఎలాంటి అన్యాయం జరగకుండా, భూ హక్కులకు పూర్తి రక్షణ కల్పించే విధంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రైతుల చేతికి పట్టాదారు పాసుపుస్తకాలు అందించడం ద్వారా వారి భూమిపై హక్కును మరింత భద్రపరుస్తున్నామని చెప్పారు.గత వైసీపీ ప్రభుత్వంలో పట్టాదారు పాసుపుస్తకాలపై అప్పటి ముఖ్యమంత్రి జగన్ ఫోటో ఉండేదని, కూటమి ప్రభుత్వం రైతుల గౌరవాన్ని కాపాడే విధంగా రైతు ఫోటోతో, ప్రభుత్వ రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలను అందిస్తోందన్నారు.రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిరంతరం కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. రైతులకు అవసరమైన ప్రభుత్వ పథకాలు, సేవలు సకాలంలో అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.రైతు సంక్షేమం కోసం పనిచేసే ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని, రైతుల భూములకు రక్షణ కల్పించడమే తమ ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గ టీడీపీ పరిశీలకురాలు పార్వతమ్మ, తహసిల్దార్ మనోజ్ కుమార్, టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎండీ అఫిఫా కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే బొండా ఉమా



**విజయవాడ, ఆగస్టు 10, నేటి శుభోదయ :** రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విజయవాడ ట్రాఫిక్ డీసీపీ షరీన్ బేగం కుమార్తె ఎండీ అఫిఫా కుటుంబ సభ్యులను సోమవారం సెంట్రల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొండా ఉమామహేశ్వరరావు పరామర్శించారు.అఫిఫా మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేసిన ఆయన, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. చిన్న వయస్సులోనే అఫిఫా మృతి చెందడం ఎంతో బాధాకరమని, ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని కోరుకున్నారు.ఎండీ అఫిఫా ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

# పనిచేయని అగ్నిమాపక పరికరాలను మూడు రోజుల్లోగా పునరుద్ధరించాలి, లేనిపక్షంలో అనుమతుల రద్దు : వీఎంసీ ఫైర్ అధికారులు

**విజయవాడ, ఆగస్టు 10, నేటి శుభోదయ :** విజయవాడ నగరంలో ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ అగ్నిప్రమాదాల నివారణకు అవసరమైన ఫైర్ సేఫ్టీ నిబంధనల అమలు, అగ్నిమాపక పరికరాల పనితీరుపై విజయవాడ నగరపాలక సంస్థ ఫైర్ విభాగం ప్రత్యేక దృష్టి సారించింది. కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు సోమవారం నగరంలోని నలిని గ్యాస్ట్రో హాస్పిటల్, పటమట లో రీజినల్ ఫైర్ ఆఫీసర్ సిహెచ్ రత్నబాబు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన అగ్నిమాపక పరికరాలు, ఫైర్ సేఫ్టీ ఏర్పాట్లు, అత్యవసర నిష్క్రమణ మార్గాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తనిఖీల్లో కొన్ని అగ్నిమాపక పరికరాలు సక్రమంగా పనిచేయని స్థితిలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అత్యవసర సమయంలో ఫైర్ సేఫ్టీ పరికరాలు పనిచేయకపోవడం వల్ల ప్రాణ, ఆస్తి నష్టం జరిగే అవకాశం ఉన్నందున దీనిని తీవ్రంగా పరిగణిస్తున్నట్లు అధికారులు తెలిపారు.పనిచేయని అగ్నిమాపక పరికరాలను మూడు రోజుల్లోగా పూర్తిస్థాయిలో పునరుద్ధరించి,




వినియోగానికి సిద్ధంగా ఉంచాలని హాస్పిటల్ యాజమాన్యాన్ని అధికారులు ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా పరికరాలను పునరుద్ధరించకపోతే, సంబంధిత అనుమతుల రద్దు కోసం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారికి సిఫార్సులు పంపిస్తామని అధికారులు స్పష్టం చేశారు.ప్రజలు అధికంగా రాకపోకలు సాగించే ఆసుపత్రుల్లో ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా ఫైర్ సేఫ్టీ ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని అధికారులు సూచించారు. అగ్నిమాపక పరికరాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయడంతో పాటు, అవసరమైన సర్వీసింగ్, నిర్వహణను ఎప్పటికప్పుడు చేపట్టాలని తెలిపారు.అత్యవసర పరిస్థితుల్లో రోగులు, సిబ్బంది, సందర్శకులను సురక్షితంగా బయటకు తరలించేందుకు అత్యవసర నిష్క్రమణ మార్గాలు స్పష్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైన సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. హాస్పిటల్ సిబ్బందికి అగ్నిమాపక పరికరాల వినియోగం, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు.నగరంలోని ఆసుపత్రులు, వాణిజ్య సముదాయాలు, విద్యాసంస్థలు, సంస్థలు, ఇతర ప్రజా వినియోగ ప్రదేశాల్లో ఫైర్ సేఫ్టీ నిబంధనల అమలుపై ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఫైర్ విభాగం అధికారులు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై నిబంధనల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ పర్యటనలో స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నరేష్, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

# రూపాయి అవినీతి లేకుండా మెగా డీఎస్సీని నిర్వహించిన ఘనత కూటమి ప్రభుత్వానిది

## - టీడీపీ డోర్-టు-డోర్ కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె



**విజయవాడ, ఆగస్టు 10, నేటి శుభోదయ :** మెగా డీఎస్సీని సమర్ధవతంగా నిర్వహించిన ఘనత కూటమి ప్రభుత్వానిదే నని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. సోమవారం ఉదయం తూర్పు లోని 13వ డివిజన్‌లో టిడీపీ డోర్-టు-డోర్ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే గద్దె రామమోహన్, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ పాల్గొని ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి తెలియజేశారు. అనంతరం ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన 13వ డివిజన్‌కు చెందిన కొల్లి రెడ్డయ్య తెలుగుదేశం పార్టీ భీమా పథకం కింద రూ.2 లక్షల రూపాయల ప్రమాద భీమా సొమ్మును ఎమ్మెల్యే గద్దె రెడ్డయ్య కుటుంబ సభ్యులకు అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డీఎస్సీ గురించి అనేక అవాస్తవాలను ప్రచారం చేస్తూ ప్రజల్లో వైఎస్సార్‌సీపీ అవమానాలను పొందుతోందన్నారు. కూటమి ప్రభుత్వంలో రూపాయి అవినీతి లేకుండా పూర్తి స్థాయిలో మెగా డీఎస్సీని నిర్వహించడం జరిగిందని చెప్పారు. మెగా డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు పొందిన వారు చాలా ఉత్సాహంగా ఉద్యోగాలను చేసుకుంటున్నారని చెప్పారు. ఆదివారం కర్నూలులో టీచర్లు అందరూ భారీ ర్యాలీ చేశారని, ప్రతిపక్ష తీరుని నిరసించారని తెలిపారు. డీఎస్సీలో అవినీతి అనేది జరగలేదని, అవినీతి జరిగితే విషయం వెంటనే బయటకు వచ్చేదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వైఎస్.జగన్ చెప్పారని డీఎస్సీపై అవాస్తవాలు ప్రచారం చేయకుండా వైఎస్సార్‌సీపీ నాయకులు తమ ఆత్మసాక్షిని ఒకసారి ప్రశ్నించుకోవాలని గద్దె సూచించారు. ఐదు సంవత్సరాల పాలన ఒక్క డీఎస్సీని గాని, జాబ్ క్యాలెండర్ ను గానీ కూడా నిర్వహించని వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మెగా డీఎస్సీని సమర్ధవంతంగా నిర్వహించిన తమ కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలోస్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, టీడీపీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు చలసాని రమణ, నూతి శ్రీను, గద్దె ప్రసాద్, ముమ్మనేని ప్రసాద్, షేక్ పిరోజ్, షేక్ నాగూర్, శొంఠి నాగేశ్వరరావు, గన్నే రవి, దూళిపాళ్ళ రాజేష్, మాదిరెడ్డి రవి, శొంఠి సాయి, ముమ్మనేని మానస, చిట్టా నిర్మల,గల్లా రవి,తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ కనకదుర్గమ్మ వారికి ఆషాడ సారెను సమర్పించిన అడ్డూరి శ్రీరామ్



**విజయవాడ, ఆగస్టు 10, నేటి శుభోదయ :** ఆషాడ మాసం సందర్భంగా సోమవారం బిజెపి ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్ కుటుంబ సమేతంగా ఇంద్రకీలాద్రి పై ఉన్న శ్రీ కనకదుర్గమ్మ వారికి సారె ను తీసుకుని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయం నుంచి పెద్ద సంఖ్యలో మహిళా భక్తులతో ఊరేగింపుగా బయలుదేరి ఇంద్రకీలాద్రి కి చేరుకున్నారు. అడ్డూరి కుటుంబ సమేతంగా శ్రీ జగన్మాత ను దర్శించుకుని, పసుపు, కుంకుమ, పువ్వులు, చీర, స్వీట్లు, పండ్లు సారే ను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో అమ్మవారికి సారె ను సమర్పించడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. రాష్ట్ర ప్రజలందరూ అమ్మవారి ఆశీర్వాదంతో, సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలి అని అమ్మవారిని వేడుకున్నాను అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షురాలు బొమ్మదేవర రత్నకుమారి, కానూరి మాధవి, చిగురుపాటి లక్ష్మి, బొడ్డు నాగలక్ష్మి , కర్రి నాగలక్ష్మి , పోలె శాంతి, జి. స్వరూపా రాణి, యర్రా సునీత, పద్మజ, చల్లా రమాదేవి, వసుంధర, మన్నే రమ, రాజేశ్వరి, బిజెపి మహిళలు అందరూ పాల్గొన్నారు.

# గుంతల రహిత రహదారులతో పాటు పరిశుభ్రమైన నగరంగా విజయవాడను తీర్చిదిద్దాలి వియంసి కమిషనర్ ధ్యానచంద్ర



**విజయవాడ, ఆగస్టు 10, నేటి శుభోదయ :** గుంతల రహిత రహదారులతో పాటు పరిశుభ్రమైన నగరంగా విజయవాడను తీర్చిదిద్దాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. సోమవారం ఉదయం కమిషనర్ తన పర్యటనలో భాగంగా నేతాజీ బ్రిడ్జి, కృష్ణలంక, బందర్ రోడ్డు తదితర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించారు. రహదారుల పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణ, రహదారుల పరిస్థితి, మొక్కల సంరక్షణ తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ఎక్కడా గుంతలు ఉండకూడదని, గుంతల రహిత రహదారులే లక్ష్యంగా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కమిషనర్ స్పష్టం చేశారు. రహదారిపై గుంతలు లేదా ఇతర సమస్యలు గుర్తించిన వెంటనే సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని అన్నారు. నగరంలోని ప్రధాన రహదారులు, సర్వీస్ రోడ్లు, వంతెనల పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రహదారుల వెంట పేరుకుపోయిన చెట్ల కొమ్మలు, ఆకులు, ఇతర వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. వ్యర్థాలు పేరుకుపోకుండా నిరంతరం పర్యవేక్షిస్తూ, సమస్యను గుర్తించిన వెంటనే పరిష్కరించాలని సూచించారు.నేతాజీ బ్రిడ్జి హైవే ప్రాంతాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దేందుకు విస్తృతంగా మొక్కలు నాటాలని కమిషనర్ సూచించారు. మొక్కలను కేవలం నాటడమే కాకుండా వాటి పెరుగుదల, సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ట్రాఫిక్‌కు, పాదచారులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా మొక్కలను ఆకర్షణీయమైన డిజైన్‌తో ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కృష్ణలంక సర్వీస్ రోడ్ ప్రాంతంలో పారిశుధ్య నిర్వహణను పరిశీలించిన కమిషనర్, రహదారులపై ఎక్కడా చెత్త, వ్యర్థాలు కనిపించకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాల కారణంగా నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి వెంటనే సమస్యను పరిష్కరించాలని, దోమల ఉత్పత్తికి అవకాశం లేకుండా పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు.అనంతరం కృష్ణలంకలోని ఏపీఎస్ఆర్ఎం పాఠశాల సమీపంలోని అన్న క్యాంటీన్‌ను కమిషనర్ పరిశీలించారు. క్యాంటీన్‌కు వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణ, వ్యర్థాల తొలగింపు తదితర అంశాలను నిరంతరం పర్యవేక్షించాలనీ సూచించారు.

# ప్రజల నుంచి అందే ప్రతి ఫిర్యాదును అత్యంత బాధ్యతతో పరిష్కరించాలి వియంసి కమిషనర్ ధ్యానచంద్ర




**విజయవాడ, ఆగస్టు 10, నేటి శుభోదయ :** ప్రజల నుంచి అందే ప్రతి ఫిర్యాదును అత్యంత బాధ్యతతో స్వీకరించి, క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి సమస్యకు శాశ్వత పరిష్కారం అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. సోమవారం ఉదయం వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కమిషనర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించి, సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.ప్రధాన కార్యాలయంతో పాటు జోనల్ కార్యాలయాల్లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమాలను కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. గతంలో ప్రజల నుంచి అందిన ఫిర్యాదుల పరిష్కార పురోగతిని శాఖాధిపతులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే సమస్యలను పెండింగ్‌లో ఉంచకుండా, నిర్దిష్ట కాలవ్యవధిలో పరిష్కరించాలని ఆదేశించారు. ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమస్యకు మూల కారణాలను గుర్తించి పరిష్కారం చూపాలని సూచించారు. నగర పరిధిలోని ప్రతి సచివాలయంలో ప్రతి సోమవారం ఉదయం 9.30 గంటలకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక తప్పనిసరిగా ప్రారంభం కావాలని కమిషనర్ ఆదేశించారు. సచివాలయాలకు వచ్చే ప్రజల నుంచి వినతులను స్వీకరించి, సంబంధిత శాఖలకు వెంటనే పంపిస్తూ, వాటిని సకాలంలో పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం అనవసరంగా కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా స్థానిక స్థాయిలోనే ఫిర్యాదులను పరిష్కరించే విధంగా అధికారులు పనిచేయాలని తెలిపారు.మున్సిపల్ సేవల కోసం అందుబాటులో ఉన్న "పురమిత్ర" యాప్‌లో నమోదవుతున్న ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, నిర్ణీత సమయంలో పరిష్కరించాలని కమిషనర్ సూచించారు. ఒక శాఖకు సంబంధించిన ఫిర్యాదును మరో శాఖకు బదిలీ చేస్తూ కాలయాపన చేయకుండా, అవసరమైన చోట శాఖల మధ్య సమన్వయం చేసుకుని సమస్యను పరిష్కరించాలని అధికారులకు స్పష్టం చేశారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడంలో శాఖల మధ్య సమర్ధవంతమైన సమన్వయం ఎంతో కీలకమని పేర్కొన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో మొత్తం 20 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. వీటిలో పట్టణ ప్రణాళిక శాఖకు సంబంధించి అక్రమ నిర్మాణాలు, రోడ్ల ఆక్రమణలకు సంబంధించిన 7 ఫిర్యాదులు, ఇంజనీరింగ్ శాఖకు 6, పబ్లిక్ హెల్త్ శాఖకు 3, రెవెన్యూ శాఖకు 3, ఎస్టేట్ శాఖకు 1 ఫిర్యాదు అందినట్లు కమిషనర్‌కు వివరించారు. ప్రతి ఫిర్యాదును సంబంధిత అధికారులు స్వయంగా పరిశీలించి, సమస్యకు శాశ్వత పరిష్కారం అందించేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. తాత్కాలిక చర్యలతో సమస్యను ముగించకుండా, అదే సమస్య తిరిగి పునరావృతం కాకుండా అవసరమైన శాశ్వత చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను కేవలం దరఖాస్తులుగా కాకుండా, నగర పాలనను మరింత మెరుగుపరిచేందుకు వచ్చిన సూచనలుగా పరిగణించాలని తెలిపారు.ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా అధికారులు పారదర్శకత, జవాబుదారీతనం, సమర్ధవంతమైన పనితీరుతో విధులు నిర్వహించాలని కమిషనర్ ధ్యానచంద్ర సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం, జాప్యానికి తావులేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్లు ఏ. రవీంద్రరావు, డాక్టర్ డి. చంద్రశేఖర్, కె. శకుంతల, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ (ఇన్‌చార్జి) డాక్టర్ గోపాల్ కృష్ణ నాయక్, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) సృజన, పర్యవేక్షణ ఇంజనీర్లు చంద్రశేఖర్, కె. దుష్యంత్, అకౌంట్స్ ఆఫీసర్ బి. సత్యనారాయణ మూర్తి, ఎస్టేట్ ఆఫీసర్ ఏ. శ్రీధర్, డిప్యూటీ డైరెక్టర్ (హార్టికల్చర్) చంద్రశేఖర్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ డి. హరీష్, బయాలజిస్ట్ సూర్య కుమార్ నాయక్, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

NETI SHUBHODAYA Publisher, Editor and Owned by GONGURA SRINIVASA RAO, D No : 41-29/6-76, RANIGARI THOTA, KRISHNALANKA,VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520013. PRGI Reg No -"APTEL/26/A1193 .. Cell No - 9696571571 ..... Printed At SUNDAY PRINTING PRESS,"D No : 1-17-18, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006 .

## ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న పేద కుటుంబాలకు అండగా నిలిచి, వారికి స్వయం ఉపాధి కల్పించేందుకు సెంట్రల్ లో P-4 పథకం ద్వారా సహాయ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి - బొండా సిద్ధార్థ

**విజయవాడ, ఆగస్టు 10, నేటి శుభోదయ :**
అజిత్ సింగ్‌నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయం వద్ద P-4 పథకంలో భాగంగా తెలుగుదేశం పార్టీ యువ నాయకులు బొండా సిద్ధార్థ మార్గదర్శకత్వంలో 25వ డివిజన్‌కు చెందిన శ్రీమతి కొలను సరస్వతి కి తోపుడు బండిని అందజేశారు.ఈ సందర్భంగా సిద్ధార్థ మాట్లాడుతూ కుటుంబ ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడంతో కూరగాయలు విక్రయించుకుంటూ కుటుంబాన్ని పోషించేందుకు తోపుడు బండి అవసరమని సరస్వతి ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ఇంటింటికి తెలుగుదేశం పాదయాత్రలో భాగంగా వారి ఇంటి ముందుకు వెళ్ళినప్పుడు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఆమె పరిస్థితిని తెలుసుకున్న ఎమ్మెల్యే వెంటనే స్పందించి, P-4 పథకం ద్వారా తోపుడు బండిని అందించేలా చర్యలు తీసుకున్నారు. నియోజకవర్గంలోని 21 డివిజన్లలో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు అవసరాన్ని బట్టి తోపుడు బండ్లు, మహిళలకు స్వయం ఉపాధి పరికరాలు, విద్యార్థులకు విద్యా సహాయం తదితరాలను అందిస్తున్నామని తెలిపారు.P-4 పథకం ద్వారా కేవలం తక్షణ ఆర్థిక సహాయం అందించడం మాత్రమే కాకుండా, పేద కుటుంబాలు స్వయం ఉపాధి ద్వారా తమ కాళ్లపై తాము నిలబడేలా చేయడమే ప్రధాన లక్ష్యమని అన్నారు. సరస్వతి కి తోపుడు బండి అందించడం ద్వారా ఆమెకు ఉపాధి అవకాశంతో పాటు కుటుంబాన్ని స్వయంగా పోషించుకునే భరోసా కల్పించినట్లు సిద్ధార్థ తెలిపారు. సెంట్రల్ నియోజకవర్గంలో పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలుస్తూ ఎమ్మెల్యే బొండా ఉమా నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాచర్ల పావని, మాచర్ల గోపి, దొంగరాంజనేయులు, మాజీ కార్పొరేటర్ బెవర నారాయణ, స్థానిక డివిజన్ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



## ఆదుకున్న చేయి.. నెల రోజుల నిత్యావసర సరుకులు అందించిన... - జనసేన నేత దుంగ దేవన్ రాజు



**విశాఖపట్నం, ఆగస్టు 11, నేటి శుభోదయ :**
పారిశ్రామిక ప్రాంతం పశ్చిమ నియోజకవర్గం జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం శెట్టి బలిజ వీధిలో యర్ర విజయలక్ష్మి , భర్త , ఇద్దరి పిల్లలతో నివాసముంటుంది, ఈ మధ్యకాలంలో అనారోగ్యంతో భర్త యర్ర జగదీష్ మృతి చందడంతో కుటుంబం విషాదంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు, ఆంధ్రప్రదేశ్ దేవాదాయ ధర్మాదాయ శాఖ,శ్రీ ఆంజనేయ స్వామి వారి దేవస్థానం (జింక్) ఆలయ ధర్మకర్త మరియు జనసేన పార్టీ 61 వ వార్డు అధ్యక్షులు దుంగ దేవన్ రాజు నెలవారి వార్డు పర్యటనలో విషయం తెలుసుకొని ఆ కుటుంబాన్ని పరామర్శించారు, జరిగిన విషయం తెలుసుకొని బాధపడ్డారు, సోమవారం అ కుటుంబానికి నెలకు సరిపడా నిత్యవసర సరుకులు అందజేశారు, అదేవిధంగా వారిద్దరి కుమారులకు చదువుకునేందుకు సహాయ సహకారాలు అందిస్తానని భరోసా ఇచ్చారు, ఈ కార్యక్రమంలో జె మోహన్, వీర మహిళ ఎన్ శంకరమ్మ, వెంకటేష్ ,శ్రీకాంత్,జనసైనికులు మరియు వీర మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం దిగొచ్చే వరకు ఉద్యమిస్తాం

**అనంతపురం, ఆగస్టు 10, నేటి శుభోదయ :**
డీఎస్సీ నియామకాలకు సంబంధించి స్పోర్ట్స్ కోటాలో అడుగడుగునా నిబంధనలు ఉల్లంఘించారని, దీనిపై తక్షణం సీబీఐ విచారణ చేయించాలని వైఎస్ఆర్‌సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి డిమాండ్ చేశారు. ప్రభుత్వం దిగొచ్చే వరకు ఉద్యమాలు చేస్తామని, అవసరమైతే అసెంబ్లీ ముట్టడికి కూడా సిద్ధమవుతామని హెచ్చరించారు. డీఎస్సీ–2025లో అక్రమాలపై సోమవారం అనంతపురంలో వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. నగరంలోని పవర్ ఆఫీస్ నుంచి పాతూరులోని మహాత్మాగాంధీ విగ్రహం వరకు పార్టీ శ్రేణులు కదంతొక్కాయి. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ డీఎస్సీ నియామకాలను అవినీతిమయం చేశారన్నారు. పేపర్ లీకేజ్‌తో పాటు స్పోర్ట్స్ కోటాకు సంబంధించి కూడా జీవోలు మార్చారని తెలిపారు. స్పోర్ట్స్ కోటాను 2 నుంచి 3 శాతానికి ఎందుకు మార్చారని ప్రశ్నించారు. కావాల్సిన వాళ్లకు స్పోర్ట్స్ సర్టిఫికెట్లు ఇచ్చుకుని ఉద్యోగాలు కల్పించారని తెలిపారు. ఈ మొత్తం వ్యవహారంపై తక్షణం సీబీఐ విచారణతో పాటు నైతిక బాధ్యతగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. డీఎస్సీకి సంబంధించి అసెంబ్లీలో చర్చకు సిద్ధమని అధికార పార్టీ నేతలు చెబుతున్నారని.. శాసన మండలిలో చర్చించే ధైర్యం లేదా? అని అన్నారు. డీఎస్సీ అక్రమాలతో పాటు ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.9500 కోట్లు చెల్లించాలని, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇవ్వాలన్నారు. ఈ డిమాండ్లతో ఇప్పటికే కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేసి నియోజకవర్గ స్థాయిలో రిలే నిరాహార దీక్షలు కూడా చేసినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ర్యాలీలు చేపడుతుంటే విజయవాడ, పులివెందుల, గుంటూరు, కడప జిల్లాతో పాటు తాడిపత్రిలో నిరసనలు తెలియజేయడానికి అడుగడుగునా అడ్డంకులు సృష్టించారని తెలిపారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తాడిపత్రికి వెళ్తుంటే అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని తాడిపత్రిలో తన ఇంట్లో నుంచి బయటకు రాకుండా చేశారన్నారు. ఈ ప్రభుత్వానికి కాలం దగ్గరపడిందని హెచ్చరించారు. డీఎస్సీలో కోచింగ్ సెంటర్లు పెట్టుకున్న వాళ్లకు, పరీక్ష ప్రక్రియలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా ఉన్న వ్యక్తికి ఫస్ట్ ర్యాంకులు వచ్చాయన్నారు. తక్షణం స్పోర్ట్స్ కోటాకు సంబంధించి వివరాలన్నీ బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. బీసీ సెల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ గౌడ్, యువజన విభాగం జిల్లా అధ్యక్షులు సాకే చంద్రశేఖర్, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్ మాట్లాడుతూ నిరుద్యోగుల ఆశలను చంద్రబాబు ప్రభుత్వం చిదిమేసిందని తెలిపారు. విద్యార్థి, యువత, నిరుద్యోగులు, డీఎస్సీలో అన్యాయానికి గురైన వారి తరఫున పోరాడుతుంటే రెడ్‌బుక్ రాజ్యాంగంతో అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. డీఎస్సీలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని, సీబీఐ విచారణకు ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. యువత రోడ్డు మీదకు వచ్చి ఆందోళనలు చేస్తుంటే పట్టించుకోవడం లేదని, భవిష్యత్‌లో ఉద్యమాలు తీవ్రంగా ఉంటామని హెచ్చరించారు. డీఎస్సీలో అన్యాయానికి గురైన అభ్యర్థులతో పాటు యువత, విద్యార్థుల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు ఆందోళనలు చేస్తామన్నారు. విద్యార్థులు, నిరుద్యోగులను రౌడీషీటర్లు, గంజాయి బ్యాచ్ అంటూ అధికార పార్టీ నేతలు అవహేళగా మాట్లాడుతున్నారని, భవిష్యత్‌లో యువత సత్తా ఏమిటో తెలియజేస్తామన్నారు.



## ఏపీ జెన్ - జెడ్ వార్ నిరసన ర్యాలీని అడ్డుకున్న పోలీసులు..!

**విజయవాడ, ఆగస్టు 10, నేటి శుభోదయ :**
"డీఎస్సీలో జరిగిన అక్రమాలపై సీబీఐ ఎంక్వైరీ వేయాలని.. కారకుడైన విద్యాశాఖ మంత్రి లోకేష్ రాజీనామా చేయాలని.. ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయాలని.. నిరుద్యోగ భృతి 3000 వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ". విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు,విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె రాజు ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ జరిగింది.ఈ కార్యక్రమంలో నిరుద్యోగులు, విద్యార్థులు,మేధావులు మరియు మాజీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ప్రచార విభాగం జోన్ –1 ప్రెసిడెంట్ రవిరాజు,మాజీ కార్పొరేటర్లు అల్లు శంకర్ రావు, అనిల్ కుమార్ రాజు, పద్మరెడ్డి,వావిల్లపల్లి ప్రసాద్, రేయ్యి వెంకటరమణ, భర్కట్ ఆలీ, సేనాపతి అప్పారావు, పామెటీ బాబ్జి,దల్లి రామకృష్ణ రెడ్డి,వార్డు అధ్యక్షులు గుజ్జు వెంకటరెడ్డి,పైడి రమణ,బల్ల శ్రీను, అశోక్ రెడ్డి, బొడేటి కిరణ్,బి శెట్టి ప్రసాద్, జకంపూడి సత్యనారాయణ, హబీబ్, సుకుమార్, డోప్ప శ్రీను, ఐ రవికుమార్, వేణు, ధమావంతి, చిరంజీవి, ఎరం శెట్టి శ్రీను, రాష్ట్ర, జోనల్, జిల్లా, నియోజకవర్గ నాయకులు కిరణ్ రాజు,తాడి జగన్నాథరెడ్డి,దివ్య కళ, దుప్పలపూడి శ్రీనివాస్ అంబటి శైలేష్ యం.సునీల్, భోగవల్లి గోవింద్, తిరుమలరావు,పద్మ శేఖర్,కె వి బాబా, నీలిరవి, మెరువ గణేష్, కరి రామారెడ్డి, పి.ఈశ్వరి, దేవివిశాలాక్షి, రాయుడుశ్రీను, గుజ్జుధీరజ్ కుమార్, సబ్బవరపు శ్రీను,నియోజకవర్గ అనుబంధ సంఘాల అధ్యక్షులు, మువ్వల సంతోష్, పి. హరి,నీతీష్, పి.సునీత,షేక్ బాబ్జి,సతీష్, లక్ష్మణరావు బాధ శ్రీను, భద్రి,తాటిపూడి రత్నం,కె. సూర్య,అనిల్ శర్మ,వార్డు పరిశీలకులు,వార్డు అనుబంధ సంఘాల అధ్యక్షులు మరియు సీనియర్ నాయకులు, జిల్లా నాయకులు,వార్డు వైస్ ప్రెసిడెంట్,మహిళలు, సచివాలయం అధ్యక్షులు, బూత్ కన్వీనర్లు,మహిళలు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు



## వెస్ట్ జోన్ లో ఆగస్టు 26న బహిరంగ వేలం నిర్వహణ...

**విశాఖపట్నం, ఆగస్టు 10, నేటి శుభోదయ :**
మహా విశాఖ నగర పాలక సంస్థ వెస్ట్ జోన్ పరిధిలోని ఖాళీగా ఉన్న దుకాణాలు, కళ్యాణ మండపాలు, రోడ్ సైడ్ మార్కెట్లకు ఆగస్టు 26వ తేదీన ఉదయం 11 గంటలకు వెస్ట్ జోన్ జోనల్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించబడునని జోనల్ కమిషనర్ బి. హేమావతి సోమవారం ఒక ప్రకటన లో తెలియజేశారు. వార్డు నెం.60 లో గుల్లల పాలెం షాపింగ్ కాంప్లెక్స్ లో దుకాణము నెం.8,16,23,24,25, 26,33,41,46,47,56, 57, ములగాడ షాపింగ్ కాంప్లెక్సు లో దుకాణము నెం.03 , ప్రకాష్ నగర్ షాపింగ్ కాంప్లెక్స్ లో దుకాణము నెం.05 షాప్ లకు మూడు సంవత్సరాల కాల పరిమితి కి మరియు మార్కెట్లలో గుల్లలపాలెం దుకాణము రోడ్ పక్కన మార్కెట్లకు (హాకర్ మండలం) లకు ఒక సంవత్సరం కాల పరిమితి కి గుత్త కు ఇచ్చుటకు తేది ఆగస్టు 26, 2026 ఉ.గం. 11 లకు వేలం పాట జరుగునని వెస్ట్ జోన్ జోనల్ కమిషనర్ తెలిపారు.కావున ఆసక్తి గల వ్యక్తులు గాని సంస్థలు గాని పూర్తి వివరాల కొరకు వెస్ట్ జోన్ గౌరీ నగర్, ఎన్ఏడి జంక్షన్ కార్యాలయంలోని పని దినాలలో పర్యవేక్షకులను సంప్రదించాలని జోనల్ కమిషనర్ తెలియజేశారు.

## సీపీ ఆదేశాలతో 24 గంటల్లోనే ఇంటర్ స్టేట్ ఆపరేషన్....



**విశాఖపట్నం, ఆగస్టు 10, నేటి శుభోదయ :**
విశాఖ సిటీ పోలీస్ కమీషనర్ డ్రా శంకబ్రత బగ్చి ఐపీస్ ఆదేశాల ప్రకారం భీమిలి పోలీసులు రికార్డు సమయంలో సంచలన కేసును చేధించారు.లిక్విడ్ గంజాయి తయారు చేస్తున్న మాస్టర్ మైండ్ పాంగి ని 24 గంటల లోపే ఒడిస్సా రాష్ట్రం, బలియగూడ జిల్లాలో అదుపులోకి తీసుకున్నారు.ఈ ఆపరేషన్ ను భీమిలి సి.ఐ దివాకర్ యాదవ్ మరియు వారి టీం సమర్థవంతంగా నిర్వహించారు. నిందితుడిని అరెస్ట్ చేసి విశాఖకు తరలించి తదుపరి విచారణ చేపట్టారు.డ్రగ్స్, లిక్విడ్ గంజాయి లాంటి మత్తు పదార్థాల సరఫరా పై ఉక్కుపాదం మోపుతామని, ఇలాంటి నేరాల్లో ఎవరు పాల్గొన్నా కఠిన చర్యలు తప్పవని సి.ఐ హెచ్చరించారు.ఈ విజయవంతమైన ఆపరేషన్ కి సీపి భీమిలి పోలీసులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## గుమ్మగట్ట మండలంలో చిత్రదుర్గ జిల్లా బృందం పర్యటన



**అనంతపురం, ఆగస్టు 10, నేటి శుభోదయ :** కర్ణాటక ప్రభుత్వం, చిత్రదుర్గ జిల్లా నుండి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ హెచ్.హనుమంతప్ప మరియు పంచాయత్ డెవలప్మెంట్ ఆఫీసర్స్ వారు బృందంగా గుమ్మగట్ట మండలంలో వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్గార్ మరియు అజీవిక మిషన్ (గ్రామీణ) (VB-G-RAM-G) పథకం కింద నిర్వహించిన పనులను పరిశీలించేందుకు బృందంగా రావడం జరిగింది. ఇందులో మొదటగా గుమ్మగట్ట మండలం 75 వీరాపురం గ్రామ పంచాయితీలో వాటర్ హార్వెస్టింగ్ పాండ్ పనిని పరిశీలించడం జరిగింది. అదేవిధంగా అక్కడ పని చేస్తున్న శ్రామికులతో చర్చిస్తూ వారికి రోజువారి కూలీ ఎంత వస్తుంది, మీకు ఏ రకాల పనులను కల్పిస్తున్నారు అని అడిగడం జరిగింది. అలాగే వారు క్యాటల్ షేడ్ పనిని, మ్యాజిక్ డ్రైన్స్ కూడ పరిశీలించడం జరిగింది- అలాగే పూలకుంట గ్రామము నందు ప్లే-ఫీల్డ్ పనిని పరిశీలించడమైనది. అలాగే గుమ్మగట్ట మండల పరిషత్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కళ్యాణదుర్గం, ఏపిడి సీబ్, గుమ్మగట్ట ఎంపిడిఓ, ఏపీవో, ఈసి, టెక్నికల్ అసిస్టెంట్ తో చర్చలు జరపడమైనది. ఎంసిసిలో ఎలాంటి పనులను చేస్తారు అనే వాటిని, ప్రతిపాదనలు ఎలా చేస్తున్నారు. అన్ని రకాల బిల్స్ VB-G-RAM-G లో ఎలా చేస్తారని వారు పరిశీలించారు. వీటి గురించి చిత్రదుర్గ జిల్లా బృందం వారికి వివరణ ఇవ్వడమైనది. అలాగే తాళ్ళకెర గ్రామము, బి.టి.పి అవాసం నందు అల్ట్రా హైడెన్సిటీని పరిశీలించడం జరిగింది. చివరిగా చిత్రదుర్గ జిల్లా బృందం వారు మండలం నందు అన్నిరకాల పనులు చాలా బగున్నాయని, ఇక్కడ సిబ్బంది కూడ బాగా వివరణ ఇచ్చారు అని సంతృప్తి వ్యక్తం చేసారు. ఈ యొక్క కార్యక్రమంలో కల్యాణదుర్గం అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ రాజారావ్, కెపాసిటీ బిలింగ్ అసిస్టంట్ ప్రాజెక్టు డైరెక్టర్ విజయకుమర్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి వి.జయరాములు, అడిషనల్ ప్రోగ్రాం అధికారి సురేష్ కుమార్, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ రవి కుమార్, మరియు అందరు సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాకులు కంప్యూటర్ ఆపరేటర్లు గుమ్మగట్ట సిబ్బంది పాల్గొనడం జరిగింది.- అనంతరం సోమవారం సాయంత్రం అనంతపురం కలెక్టరేట్లోని జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ను డ్వామా పిడి సలీమ్ భాష, చిత్రదుర్గ జిల్లా బృందం సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా పర్యటన వివరాలను జిల్లా కలెక్టర్ కు తెలియజేశారు.

## రాజకీయం చేయొద్దని తండ్రి విజ్ఞప్తి !





**విశాఖపట్నం, ఆగస్టు 10, నేటి శుభోదయ :** రాజమండ్రిలో కారుతో ఢీ కొట్టిన ఘటనలో మృతి చెందిన మెడికో విద్యార్థి ప్రియాంక కేసు దర్యాప్తు వేగం పెంచారు పోలీసులు. నిందితుడిని ఇప్పటికే అరెస్టు చేసిన పోలీసులు కఠిన చట్టాలను అతనిపై మోపారు. ప్రియాంక తండ్రి వెంకటేష్ తన కుమార్తెను కోల్పోయిన బాధలో ఉండగా, ఒక వర్గం మీడియా ఆయన చేసిన కామెంట్స్‌ను వక్రీకరించిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వాన్ని, పోలీసులను తప్పు పట్టినట్లు ప్రచారం చేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. పోలీసులపై తమకు నమ్మకం ఉందని, నిందితులకు శిక్ష పడుతుందని వెంకటేష్ ధీమా వ్యక్తం చేశారు. మరోవైపు ప్రియాంక మృతిపై రాజకీయ నేతలు సంతాపం తెలిపారు. మద్యం మత్తులో నిండు ప్రాణాన్ని బలి తీసుకున్న నిందితులకు కఠిన శిక్ష ఖాయమని డిప్యూటీ సీఎం పవన్ హామీ ఇచ్చారు. హోంమంత్రి అనిత, మరో మంత్రి రామానాయుడు కూడా బాధితురాలి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రస్తుతం గాంధీ ఆసుపత్రిలో ఉన్న ప్రియాంక మృతదేహానికి పోస్టుమార్టం పూర్తి చేసి కుటుంబ సభ్యులకు అప్పగించనున్నారు.

## ఇంటికి పెద్ద కొడుకుగా ఉండి ఆదుకుంటామన్న చంద్రబాబు నాయుడు బాధ్యత ఏది?



**విశాఖపట్నం, ఆగస్టు 11, నేటి శుభోదయ :** విశాఖలోని స్థానిక నాయకుల అజమాయిషీ, అధికార బలం, టీడీపీ నేతల సొంత లాభాల కోసం నిబంధనలు తుంగలో తొక్కుతున్నారు, నాయకుల దౌర్జన్యంతో ప్రజలకు నీటి కొరత ఏర్పడుతోందని తెలుగు శక్తి అధ్యక్షులు బి.వి.రామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం తెలుగు శక్తి ఆధ్వర్యంలో వీజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గేటర్ విశాఖ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం వాసులు వారి నీటి కష్టాలను వివరించారు. ఈ సందర్భంగా రామ్ మాట్లాడుతూ రాజకీయ జోక్యం, నీటి పంపిణీలో అసమానతలు ప్రజల దాహార్తిని పెంచుతున్నాయని మండిపడ్డారు. అధికార బలంతో నాయకులు అనుకూల ప్రాంతాలకే నీటి సరఫరా చేయడంతో ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వానికి పట్టింపు లేకుండా పోయిందన్నారు. గత ఆరు నెలలు నుంచి నీటి సరఫరా నిలిపివేయడం ఎంత దారుణమన్నారు. జీవీఎంసీ అధికారుల మహా ప్రణాళికలు, స్థానిక నేతల నిర్లక్ష్య వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి "పెద్దకొడుకుగా" (బాధ్యతగల కుటుంబ పెద్దలా) ఉండి సంరక్షిస్తానని, ఆదుకుంటానని పలు సందర్భాల్లో ప్రకటించిన విషయం తెలిసిందే అన్నారు. అయితే, ప్రజల కష్టసుఖాల్లో పాలు పంచుకుంటూ, ప్రభుత్వ పరంగా వారికి పూర్తి భరోసా కల్పించడమే లక్ష్యమని చెప్పుకుంటున్నారే తప్ప ఆచరణలోని, ప్రజా సమస్యలు పరిష్కారంలో కనిపించడం లేదని మండిపడ్డారు. గ్రేటర్ విశాఖలో గత కొన్ని నెలలుగా నీటి సమస్యతో బాధపడుతున్న అక్కిరెడ్డిపాలెంలోని నివాసుల సమస్య సీఎం దృష్టికి రాకపోవడం శోచనీయమన్నారు. అందులోని ఆ ప్రాంతం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు నియోజకవర్గం. ఇప్పటికైనా స్పందించి నీటి సరఫరాను అందేలా చేయాలని లేని పక్షంతో ఈ విషయంలో మరింత ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ప్రజా సమస్యలపై తెలుగు శక్తి పోరుబాట సాగిస్తుందని, విశాఖ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతామన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, రానున్న జీవీఎంసీ ఎన్నికల్లో పరాజయం తప్పదని కూడా అన్నారు. ఈసారి జీవీఎంసీ ఎన్నికల్లో తెలుగు శక్తి ప్రతి వార్డులోని పర్యటించి ప్రజా సమస్యలపై పోరాడుతుందని, అవసరమైతే పోటీ చేస్తుందని కూడా హెచ్చరించారు.

**ఆరు నెలలు క్రిందట కుళాయి కన్‌క్షన్ తొలిగించేశారు**

**- కణితి చంద్రావతి**

2011లో కుళాయిలు వేశారు. అయితే, ఆరు నెలలు కిందట కుళాయి కన్‌క్షన్లు నిలిపివేశారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యేకి, వార్డు కార్పొరేటర్‌కి, జీవీఎంసీ అధికారులుకి ఫిర్యాదులు చేసిన పట్టింపు లేదు. స్థానిక పెద్దలను కలసినా ఫలితం లేకుండా పోయింది. అంతా చెత్తులేతేశారు. ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసిన ఫలితం లేకుండాపోయింది. ఇక్కడ తాగునీటి సమస్య తీవ్రంగా వేధిస్తోంది. గుక్కెడు నీటి కోసం ఇక్కడ ప్రజల పాట్లు అంతాఇంతా కాదు. రెండు మైళ్ళు దూరం నీటి కోసం నడుస్తున్నాం. నీటి కనెక్షన్లు లేక, త్రాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నాం. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, సంబంధిత అధికారులు ఇక్కడి సమస్యను గుర్తించి అందరికీ నీరు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.విలేకరుల సమావేశంలో ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం ప్రధాన కార్యదర్శి పరిపూర్ణ చారి, ఎంపాడ దేవుడమ్మ, ఉప్పాటీ ఉమాదేవి, డాక్టర్ పప్పూర్ నికుంజ, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బాజపా రాష్ట్ర రధసారధి పివిఎన్ మాధవ్ జన్మదిన వేడుకలు

### - గాజువాకలో పలు సేవా కార్యక్రమాలు నిర్వ హించిన బాజపా శ్రేణులు



**విశాఖపట్నం, ఆగస్టు 10, నేటి శుభోదయ :** బిజేపి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ పుట్టిన రోజు సందర్భంగా సోమవారం గాజువాక కన్వీనర్ మరియు రాష్ట్ర మీడియా పేనలిస్ట్ కరణంరెడ్డి నరసింగరావు (కే ఏన్ ఆర్ ) ఆధ్వర్యంలో పలువురు నాయకులతో కలిసి మాధవ్ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి గజమాలతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కేఎన్ఆర్ మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి సారధ్యం ,అటల్ మోదీ సుపరిపాలన యాత్ర,జనతా వారధి, మన ఊరు మన జెండా వంటి కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించడం జరిగిందని అన్నారు. పార్టీ జెండా ప్రతి వీదిలో ఎగిరే విధంగా కార్యకర్తలను తయారు చేసారని అన్నారు. ప్రదాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని అన్నారు. కే ఎన్ ఆర్ సౌజన్యంతో మాధవ్ పుట్టిన రోజు సందర్భంగా అగనంపూడి గవర్నమెంట్ హాస్పిటల్ లో 100 మంది రోగులకు పండ్లు రొట్టెలు పంపిణీ చేసారు. గాజువాక శ్రీనగర్ డిజైర్ సొసైటీ హెచ్.ఐ.వి పాజిటివ్ పిల్లలకు పౌష్టికాహారం కిట్లు పంపిణీ మరియు పాతకర్నవానిపాలెం పార్టీ కార్యాలయంలో వంద మంది పేద మహిళలకు ఉచితంగా చీరలు పంపిణీ చేసామని కేఎన్ఆర్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గూటూరు శంకరరావు,బొత్స దిలీప్, రంగనాయకులు, ఈశ్వరరావు, కృష్ణారెడ్డి, ముసలయ్య, జాగారపు శ్రీను, తాతారావు, రవీంద్ర, రాజు, కేవి రమణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమానికి - 130 ఫిర్యాదులు






**విశాఖపట్నం, ఆగస్టు 10, నేటి శుభోదయ :** ప్రతీ సోమవారం నగర పోలీసు కాన్ఫరెన్స్ హాల్ నందు నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీ జీ ఆర్ ఎస్ )కు సోమవారం 130 ఫిర్యాదులు రావడం జరిగినది. ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పి జి ఆర్ ఎస్ ) కార్యక్రమంలో నగర పోలీసు కమిషనర్ డ్రా .శంఖబ్రత భాగ్చి, ఐ.పీ.ఎస్., ప్రత్యక్షముగా నగర పోలీసు సమావేశమందిరం నందు ఉండి, నగర సబ్-డివిజన్ ఏ.సి.పి లు మరియు పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ లు, ఎస్సెలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొనీ, ఫిర్యాదులు స్వీకరిరిచారు.సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీ జీ ఆర్ ఎస్ ) కార్యక్రమానికి 130 మంది ఫిర్యాదుదారులు వచ్చి తమ తమ సమస్యలను రిపోర్టులు ద్వారా పోలీసు కమిషనర్ అందజేసినారు. సిపి ఫిర్యాదులను పరిశీలించి ఫిర్యాది దారులతో స్వయముగా మాట్లాడి, వారి వారి సమస్యలను తెలుసుకొని, సంబంధిత పోలీసు అధికారులతో తక్షణమే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి, సమస్యకు సంబంధించి, చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాలని, ఫిర్యాదిదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించవలసినదిగా ఆదేశాలు ఇవ్వడమైనది. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీ ఆర్ ఎస్ ) కార్యక్రమంలో ఫిర్యాదుదారులు ఇచ్చిన ఫిర్యాదులలో కుటుంబ కలహాలు, భూ వివాదాలు, భార్య భర్తల గొడవలు, మోసానికి సంబంధించినవి మరియు సివిల్ కేసుల విషయం సంబంధించిన ఫిర్యాదులు ఉన్నాయి.

NETI SHUBHODAYA Publisher, Editor and Owned by GONGURA SRINIVASA RAO, D No : 41-29/6-76, RANIGARI THOTA, KRISHNALANKA,VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520013. PRGI Reg No -"APTEL/26/A1193 .. Cell No - 9696571571 ..... Printed At SUNDAY PRINTING PRESS,"D No : 1-17-18, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006 .